ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 2 డిసెంబరు 2025

పోస్టుమేన్ ఘరానా మోసం

ఉంగుటూరు సబ్‌పోస్టాఫీసులో పనిచేస్తున్న పోస్టుమేన్ ఘరానా మోసానికి పాల్పడ్డాడు. డిపాజిటర్ల సొమ్ము రూ.50 లక్షల వరకు తీసుకుని పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోస్టల్ విజిలెన్స్ అధికారులు ఖాతాల తనిఖీలు ప్రారంభించారు. నిధుల స్వాహా నిజమేనని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పన్నెండేళ్లుగా పనిచేస్తున్న పోస్టుమేన్ శేఖర్ తమని నమ్మించి ముంచాడని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకుని తమ నగదు తమకు ఇప్పించాలని వేడుకుంటున్నారు.

డిపాజిటర్ల సొమ్ము రూ. 50 లక్షలతో అదృశ్యం

ఉంగుటూరు సబ్ పోస్టాఫీసులో వెలుగుచూసిన అవినీతి



తాము కట్టిన డబ్బులు అకౌంట్లో జమకాలేదంటూ పాస్‌పుస్తకాలు చూపుతున్న ఖాతాదారులు

- నిందితుడు శేఖర్‌ది ఏలూరు జిల్లా పెదపాడు
- వరసలతో పిలిచి వంచించాడని ఖాతాదారుల గగ్గోలు
- విచారణ చేపట్టిన పోస్టల్ విజిలెన్స్ అధికారులు
- ఇప్పటి వరకు విచారణలో రూ.5 లక్షల వరకు నిర్ధారణ
- కొనసాగుతున్న ఖాతాల తనిఖీలు
- మొత్తం రూ.50 లక్షల వరకు ముంచినట్టు పోలీసులకు ఫిర్యాదు



ఉంగుటూరు సబ్‌పోస్టాఫీసు కార్యాలయం

ఉంగుటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు సబ్‌పోస్టాఫీసులో ఏలూరు జిల్లా పెదపాడుకు చెందిన కె.శేఖర్(37) గత 12 ఏళ్లగా పోస్టమేన్‌గా పనిచేస్తున్నాడు. నిత్యం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఉత్తరాలను బట్వాడా చేస్తూ అందరినీ వరసలతో పిలుస్తూ పరిచయాలు పెంచుకున్నాడు. అనతి కాలంలోనే గ్రామస్థులందరికీ నమ్మకస్తుడిగా మారాడు. ఈ క్రమంలో కూలీ నాలీ చేసుకునే పేదలను టార్గెట్‌గా చేసుకున్న శేఖర్ తరచూ వారి ఇళ్లకు వెళ్లి పోస్టాఫీసు పథకాలపై అవగాహన కల్పించేవాడు. పోస్టాఫీసులో ఎంతో కొంత డబ్బును నెల నెలా పొదుపు చేసుకుంటే భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడుతుందని నచ్చచెప్పి వారిని పొదుపు బాట పట్టించాడు. అతడి మాటలను నమ్మిన కొంతమంది మహిళలు తమ అకౌంట్ పుస్తకాలతో పాటు క్రమం తప్పకుండా కట్టాల్సిన సొమ్మును పోస్టాఫీస్‌లో జమచేయమని శేఖర్‌కు

మిగతా 6లో..

పోస్టల్ విజిలెన్స్ అధికారుల విచారణ

ఉంగుటూరు సబ్ పోస్టాఫీసులో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై గుడివాడ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ భూక్యా విజయ్ నేతృత్వంలోని విజిలెన్స్ బృందం రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. గత నెల 25 నుంచి పోస్టాఫీసులో తనిఖీలు ప్రారంభించింది. డిపాజిటర్లను పాస్‌పుస్తకాలతో సహా పోస్టాఫీసుకు వచ్చి బ్యాలెన్స్ సరి చూసుకోవాలని గ్రామంలో మైక్ ప్రచారం ద్వారా చైతన్యపరిచింది. కస్టమర్ల సమక్షంలో పాస్ పుస్తకాల్లో బ్యాలెన్స్, పోస్టల్ అకౌంట్‌లో నమోదైన బ్యాలెన్స్ సరిచూసే ప్రక్రియ వేగవంతం చేసింది.

పోస్ట్‌మాస్టర్ పనితీరుపై ఆరా

సబ్ పోస్టాఫీసులో పోస్ట్‌మాస్టర్‌కె.దేవేందర్‌రావు పనితీరుపై అధికారులు ఆరా తీస్తున్నారు. పోస్ట్‌మేన్ శేఖర్ చేసిన నిర్వాకం, అవకతవకల్లో పోస్ట్‌మాస్టర్ పాత్ర ఉందని తేలితే ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ తెలిపారు.

టీ స్టాల్‌లో సందడి చేస్తున్న మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ రామకృష్ణ




చాయ్.. సందడి చెయ్!

ఒకరు మంత్రి.. మరొకరు ఆర్టీసీ చైర్మన్.. ఇంకొకరు డీసీఎంఎస్ చైర్మన్ ఈ ముగ్గురు కలిసి ఓ టీ దుకాణంలోకి వెళ్లారు. అక్కడ టీ పెడుతున్న మహిళను కాసేపు పక్కన కూర్చోమని స్టౌపై పెట్టిన పాత్రలో పాలు, పంచదార, టీ పొడి వేసి మరిగించారు. ఆ తర్వాత గ్లాసులో పోసుకుని ఒకరికిమరొకరు అందించుకున్నారు. వెచ్చటి టీ తాగుతూ బాగా కాశారు అంటూ ఒకరినొకరు అభినందించుకున్నారు. వీరు మరెవరో కాదు కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు, బండి రామకృష్ణ. నగరంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వీరు ఐదురోడ్ల సెంటర్‌లో సోమవారం పర్యటించారు. టీ స్టాల్స్ వారితో మమేకమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హోటల్స్ వ్యాపారి అయిన బండి రామకృష్ణ టీ కాసి మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు అందించారు. వారు టీ బాగా కాశారు అంటూ రామకృష్ణను అభినందించారు.

2.13 లక్షల మందికి రూ.103 కోట్ల పంపిణీ

జిల్లాలో ప్రతి నెలా 2.13 లక్షల మందికి రూ.103 కోట్ల సొమ్ము పింఛనుగా అందిస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం మచిలీపట్నం 16వ డివిజన్‌లోని ఐదు రోడ్ల సెంటర్‌లో డయాలసిస్ బాధితుడు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఇంటికి వెళ్లి రూ.10 వేలు అందజేశారు. అలాగే నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగుడు చందాల ఆదినారాయణ ఇంటికి వెళ్లి అతనికి రూ.15 వేలు పింఛను పంపిణీ చేశారు. -(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్)

ఎనికేపాడులో బుడమేరు, ఏలూరు కాల్వ కలిసే అండర్ టన్నెల్



బుడమేరు యూటీ విస్తరణ

- రూ.30 కోట్లకు పరిపాలనా ఆమోదం
- త్వరలో టెండర్ల ప్రక్రియ
- కింద బుడమేరు.. పైన ఏలూరు కాల్వ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గత ఏడాది విజయవాడను వరదలతో ముంచేసిన బుడమేరుకు ఎనికేపాడులో ఉన్న అండర్ టన్నల్ (యూటీ)ను విస్తరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. భవిష్యత్తులో వరదలొచ్చినా ఇబ్బందులు లేకుండా టన్నల్‌ను విస్తరించాలని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. వరదల తర్వాత బుడమేరు ప్రక్షాళనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆక్రమణలను తొలగించడంతో పాటు ఎనికేపాడులో ఉన్న యూటీని విస్తరించాలని ప్రతిపాదించారు. దీనికి ప్రభుత్వం రూ.30 కోట్లకు పరిపాలనాపరమైన ఆమోదం తెలిపింది.

4,500 క్యూసెక్కుల నుంచి 30 వేల క్యూసెక్కులకు

బుడమేరు.. మైలవరం, విజయవాడ, విజయవాడ రూరల్ మండలం మీదుగా కృష్ణాజిల్లాలోకి ప్రవేశిస్తుంది. అలాగే, తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి మొదలైన ఏలూరు కాల్వ నగరం నుంచి నేరుగా ఏలూరుకు చేరుకుంటుంది. ఈ రెండు కాల్వలు ఎనికేపాడు వద్ద కలుస్తాయి. ఏలూరు కాల్వ విస్తరణ పరిమాణంతో బుడమేరు కాల్వపై యూటీని నిర్మించారు. దీనిద్వారానే ఏలూరు కాల్వ, బుడమేరు ప్రవహిస్తాయి. ఒకవిధంగా చెప్పాలంటే కింద బుడమేరు ప్రవహిస్తుంటే, పైన ఏలూరు కాల్వ వెళ్తుంది. బుడమేరు ఏర్పడినప్పుడు ఈ యూటీని నిర్మించారు. దీని సామర్థ్యం 4,500 క్యూసెక్కులు. నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు

మిగతా 6లో..

వాయుగండం!

భయపెడుతున్న దిత్వా తుఫాను

- 4వ తేదీ వరకు కోస్తా తీరం వెంబడి వర్షాలు పడే అవకాశం
- మిల్లుల వద్ద బారులుతీరిన ధాన్యం లోడు వాహనాలు
- బ్యాంకు గ్యారెంటీ రెట్టింపు చేయకపోవడంతో జనరేట్ కాని ట్రక్‌షీట్‌లు
- ఆఫ్‌లైన్‌లో భారీగా మిల్లులకు తరలింపు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : దిత్వా తుపాను వాయుగుండం ప్రభావం జిల్లా రైతులను వణికిస్తూనే ఉంది. సోమవారం ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో ధాన్యం రాశులపై పరదాలు కప్పి ఉంచారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు, గోనె సంచులకు ఎత్తి ధాన్యం మిల్లులకు చేరవేసేందుకు అవకాశం లేకుండా పోయింది. తీవ్ర తుపాను వాయుగుండంగా మారినా, దీని ప్రభావంతో ఈ నెల 4వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికలు రైతుల కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. వాతావరణం అనుకూలంగా లేక పోవడంతో గత రెండు రోజులుగా ఆఫ్‌లైన్‌లో ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారు. మిల్లులకు తరలించిన ధాన్యం ధరను రానున్న రోజుల్లో ఎంత మేర నిర్ణయిస్తారనే విషయంపైనా రైతుల్లో ఆయోమయం నెలకొంది.

ఎఫ్‌సీఐకు లెవీ బియ్యం ఇచ్చేందుకు ఆలస్యంగా అనుమతులు

జిల్లాలో ధాన్యం కొనుగోలు, ధాన్యం మరపట్టిన తర్వాత ఎఫ్‌సీఐకు లెవీ బియ్యం ఇచ్చేందుకు త్వరితగతిన అనుమతులు ఇస్తామని మిల్లర్ల అసోషియేషన్ నాయకులతో జరిగిన తొలి సమావేశంలో అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిసింది. కానీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన 15 రోజుల తర్వాత ఎఫ్‌సీఐకు లెవీ బియ్యం ఇచ్చేందుకు అనుమతులు వచ్చాయని మిల్లర్లు అంటున్నారు. ఎఫ్‌సీఐ గూడౌన్‌లకు ఒక్కో మిల్లు నుంచి లెవీ బియ్యం 20 లారీలను పంపితే, అందులో 10 లారీలు మాత్రమే దిగుమతి చేసుకుంటున్నారని, మిగిలిన లారీలు ఆలస్యంగా దిగుమతి కావడంతో బిల్లులు సకాలంలో జమ కావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికే బీజీలు చూపామని, ఎఫ్‌సీఐ నుంచి సకాలంలో నగదు

మిగతా 6లో..



ధాన్యం రాశులపై కప్పిన పరదాలు

జనరేట్ కాని ట్రక్ షీట్లు

జిల్లాలోని 176 మిల్లుల యజమానులు ధాన్యం కొనుగోలు చేసేందుకు నవంబరులో బ్యాంకు గ్యారెంటీలు(బీజీ) చెల్లించారు. ఆ నెలలో కొనుగోలు చేసిన ధాన్యంతో ఈ బీజీలు అయిపోయాయి. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో త్వరితగతిని ధాన్యం కొనుగోలు చేసేందుకు 1:1 పద్ధతిలో అధికారులు అనుమతులు ఇచ్చారు. జిల్లాలో సోమవారం నాటికి 1.70 లక్షల టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసింది. మిల్లర్లు చెల్లించిన బీజీలు అయిపోవడంతో రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే) నుంచి మిల్లులకు ధాన్యం పంపేందుకు ట్రక్ షీట్‌లు జనరేట్ చేయడానికి సర్వర్ సహకరించడంలేదు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వరి కోతలు ఒక్కసారిగా ఊపందుకోవడంతో మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం రావడంతో ధాన్యం కొనుగోళ్లు కొంతమేర నిలిచిపోయాయి. ధాన్యం ఏ మిల్లుకు పంపాలనే అంశంపై తేల్చుకోలేక ఆర్ఎస్‌కే సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఉదాహరణకు ఒక మిల్లు యజమాని కోటి రూపాయలను బీజీగా చూపితే 1:1 పద్ధతిలో రెండు కోట్ల రూపాయల వరకు ధాన్యం కొనుగోలు చేసేలా వెసులుబాటు కల్పించారు.

విద్యుత్ వెలుగులు!

- ఉమ్మడి కృష్ణాలో రూ.117 కోట్లతో 24 కొత్త సబ్‌స్టేషన్లు
- లో ఓల్టేజీకి ఇక చెక్.. ఏపీసీపీడీసీఎల్ టెండర్ల ఆహ్వానం

6

రాష్ట్రస్థాయి రగ్బీ విజేతలు కర్నూల్ జట్లు

- బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో కృష్ణా జట్టు
- ముగిసిన రాష్ట్రస్థాయి అండర్-14 బాల,బాలికల రగ్బీ చాంపియన్ షిప్

వైద్యవృత్తి ఎంతో పవిత్రం

- మంత్రి సత్యకుమార్ యాదవ్
- పిన్నమనేనిలో ఘనంగా ఫ్రెషర్స్‌డే

8

పంచాయతీల పంచన..

ఎన్నాళ్లీ ఆవేదన

పంచాయతీల పునర్విభజన కోసం ఎదురుచూపులు

- ఉమ్మడి కృష్ణాలో వందకు పైగా గ్రామాలు అనుబంధ జాబితాలో..
- 50కు పైగా గ్రామాలను పంచాయతీలుగా మార్చాలన్న డిమాండ్
- వేరే పంచాయతీలకు అనుబంధం.. అభివృద్ధికి ప్రతిబంధకం..
- పన్నులు చెల్లిస్తున్నా మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు
- 15 గ్రామాలను పంచాయతీలుగా చేసే అవకాశం
- పునర్విభజనపై నిషేధం ఎత్తివేత నేపథ్యంలో డిమాండ్లు

కేసరపల్లి పంచాయతీ వెంకట నరసింహాపురం కాలనీ



- గన్నవరం మండలం కేసరపల్లి పంచాయతీకి వెంకట నరసింహాపురం కాలనీ అనుబంధంగా ఉంది. 1999లో ఈ కాలనీలో 1,600 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. రికార్డుల ప్రకారం ప్రస్తుతం ఈ కాలనీలో 3,200 మంది జనాభా ఉండగా, 2,500 మంది ఓటర్లు ఉన్నారు. ఈ కాలనీ బహుళ అంతస్థుల భవనాలతో రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాంతంగా అభివృద్ధి చెందింది. కానీ, కేసరపల్లి పంచాయతీ పైసా కూడా ఈ కాలనీలో ఖర్చు చేయలేదు. బహుళ అంతస్థుల భవనాలు ఉన్నప్పటికీ ఈ కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు లేవు. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం, నీటి నిల్వతో కనిపిస్తాయి. తమ కాలనీని ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
- మచిలీపట్నం మండలం తాళ్లపాలెం పంచాయతీలో 18 నోటిఫైడ్ అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటిలో పల్లెపాలెం, మోడి, వైఎస్సార్ కాలనీ అనే మూడు గ్రామాలు మాత్రం ఒక్కోటి సుమారు 1,500 జనాభాను కలిగి ఉన్నాయి. ఈ మూడింటినీ ప్రత్యేక పంచాయతీలుగా ప్రకటించాలన్న డిమాండ్ వస్తోంది. మిగిలిన 15 గ్రామాలు అతి తక్కువ జనాభాతో ఉండటం

మిగతా 6లో..

పేరుకే గ్రామాలైనా అవి ఇతర పంచాయతీలకు అనుబంధంగా ఉంటాయి. ఈ కారణంగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ వంటి కనీస మౌలిక సదుపాయాలకు కూడా నోచుకోవు. తమ ప్రాంతాలు పంచాయతీ పాలకవర్గాల చిన్నచూపునకు గురవుతున్నాయన్న ఆవేదనతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఠంచనుగా పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీలు ఈ అనుబంధ గ్రామాలపై రూపాయి ఖర్చు పెట్టట్లేదు. పంచాయతీల పునర్విభజనపై నిషేధం ఎత్తివేస్తూ, పునర్నిర్మాణానికి వీలుగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో దృష్టి సారించాల్సిన గ్రామాల పరిస్థితి ఇలా ఉంది.

- (ఆంధ్రజ్యోతి, విజయవాడ)

గుడ్లవల్లేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఫార్మసీ విద్యార్థినులు



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నిరోధక చర్యలు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలి, సుఖవ్యాధులు, చికిత్స గురించి ఎయిడ్స్ యాక్టు 2017, ఏఆర్‌టీ మందులు, టోల్‌ఫ్రీ నెంబరు 1097 గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు.

దేశానికే ఐకాన్ సెంటర్‌గా మంగినపూడి బీచ్

- మంత్రి కొల్లు రవీంద్ర

6



హైకోర్టులో ఐఏఎల్ డైరీని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

హైకోర్టులో ఐఏఎల్ డైరీ ఆవిష్కరణ

విజయవాడ లీగల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) డైరీని హైకోర్టులో సోమవారం న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ డైరీలో న్యాయవాదులకు కావాల్సిన సమాచారం పొందుపరచి ప్రతి ఏడాది న్యాయవాదులకు ఉచితంగా చలసాని వెంకట్ అందించడం ముదావహమన్నారు. కార్యక్రమంలో ఐఏఎల్ హైకోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పింఛన్లతో పేదలకు భరోసా

- హోంమంత్రి అనిత
- రామలింగేశ్వరనగర్‌లో రిటైనింగ్ వాల్ పనులకు శంకుస్థాపన

రామలింగేశ్వరనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పేదలకు ప్రతి నెలా మొదటి తేదీన క్రమం తప్పకుండా ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేస్తూ పేదలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నదని హోంమంత్రి వంగలపూడి అనిత, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సోమవారం ఉదయం నియోజకవర్గ పరిధిలోని 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని రుద్రభూమి వద్ద సుమారు రూ.కోటి 40 లక్షల అంచనా వ్యయంతో రిటైనింగ్ వాల్ పనులకు హోంమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం డివిజన్‌లో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రమం తప్పకుండా పింఛన్లు అందజేస్తున్నామన్నారు. దిత్వా తుఫాను సందర్భంగా ప్రజలను అప్రమత్తం చేసి ముందు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, రామలింగేశ్వరనగర్‌లో రిటైనింగ్ వాల్ లేక కొన్ని నివాసాలలోకి నీటి ప్రవాహం వచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది పునరావృతం కాకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో అమ్మిశెట్టి వాసు, వీఎంసీ ఈఈ సామ్రాజ్యం, సెంట్రల్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్ కిషోర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరుణ కుమారికి స్వాగతం పలుకుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

కరుణకుమారికి గన్నవరంలో ఘనస్వాగతం

విజయవాడ(స్పోర్ట్స్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తొలి మహిళా బ్లైండ్ ప్రపంచ కప్ భారత్ విజయంలో జట్టులో కీలకపాత్ర పోషించిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి పి.కరుణ కుమారికి గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. శాప్ చైర్మన్ రవినాయుడు, ఎండీ ఎస్.భరణీలు కరుణను సన్మానించారు. విద్యార్థులు, యువ క్రీడాకారులు, శాప్ సిబ్బంది జాతీయపతకాలతో స్వాగతం పలుకగా దేశభక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ, భారత బ్లైండ్ జట్టులో కరుణ కుమారి అసాధారణ ప్రదర్శన రాష్ట్రానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కోటేశ్వరరావు, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి, శాప్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

విజయవాడలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



విజయవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వివాహాది శుభకార్యాలకు విశిష్ట, విభిన్న వస్త్రాలతో మరోమారు విజయవాడ నగరంలో 'నేషనల్ సిల్క్ ఎక్స్‌పో -ఎగ్జిబిషన్ కమ్ సేల్'ను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. బందరురోడ్డులోని శ్రీశేషసాయి కల్యాణ వేదికలో నవంబరు 27న ప్రారంభమైన ఎగ్జిబిషన్ ఈనెల 27వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. షాపింగ్‌తో కొనుగోలుదారులు గొప్ప అనుభూతిని పొందుతారని.. ప్రదర్శనలో వేలాది రకాల పట్టు, కాటన్ డిజైనర్ దుస్తులు, చీరలు, బ్లౌజులు, కుర్తాలు ఉన్నాయన్నారు. అన్ని రకాల వస్త్రాలను 50 శాతం వరకు తగ్గింపు ధరతో విక్రయిస్తున్నామని ప్రకటించారు. ఎక్స్‌పోలో వివిధ డిజైన్లు, నమూనా చీరలు, దుపట్టాలు, సల్వార్ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయని, వీటిలో టస్సార్, మట్కా, బీహార్ భాగల్పూర్‌సిల్క్, గుజరాత్ సంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ అండ్ పటోల, తమిళనాడు కంజీవరం ఎంబ్రాయిడరీ సిల్క్, జమ్మూ కశ్మీర్ తాబి సిల్క్ చీరలు లభిస్తాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన వుంటుందని, ప్రవేశం ఉచితమని నిర్వాహకులు పేర్కొన్నారు.



ముక్త్యాల కోటిలింగ క్షేత్రంలో కుటుంబసభ్యులతో తనికెళ్ల భరణి

ముక్త్యాల క్షేత్రంలో తనికెళ్ల భరణి

జగ్గయ్యపేట రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముక్త్యాల కోటిలింగ హరిహర మహా క్షేత్రంలో కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వర స్వామిని సినీనటుడు తనికెళ్ల భరణి కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు రాజీవ్ తేజస్వీ, హర్ష, తదితరులు పూజల అనంతరం ప్రసాదాలు అందజేశారు. ఈవో హరిదుర్గా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగులు!

ఉమ్మడి కృష్ణాలో రూ. 117 కోట్లతో 24 కొత్త సబ్‌స్టేషన్లు





బెజవాడ నగరం సహా ఉమ్మడి కృష్ణాలో జనసాంద్రత పెరుగుతోంది. ఇదే సమయంలో విద్యుత్‌కు డిమాండ్ కూడా అధికమవుతోంది. విద్యుత్ పంపిణీ వ్యవస్థ మెరుగుపరచటానికి ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఏపీసీపీడీసీఎల్ రూ.117 కోట్ల వ్యయంతో భారీగా సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. తాజాగా టెండర్లను కూడా పిలిచింది. విజయవాడ టౌన్ డివిజన్, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మొత్తం 24 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఒకేసారి టెండర్లు ఆహ్వానించింది.

- ఈవీ స్టేషన్లు, గృహ నిర్మాణాలు, పట్టణీకరణ, పారిశ్రామికీకరణతో డిమాండ్
- పాతవి సామర్థ్యం చాలకపోవటంతో కొత్తవి ఏర్పాటుకు నిర్ణయం
- లో ఓల్టేజీకి ఇక చెక్.. ఏపీసీపీడీసీఎల్ టెండర్ల ఆహ్వానం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జనాభా పెరగటంతో పాటు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని పట్టణ ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. వాణిజ్య కార్యకలాపాలు పెరిగాయి. దీంతో విద్యుత్‌కు డిమాండ్ ఏర్పడుతోంది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, ఈవీ చార్జింగ్ స్టేషన్ల మౌలికసదుపాయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. దీంతో పాటు కొత్త ప్రాంతాలకు పెద్ద ఎత్తున విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరచుకోవాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను విస్తరించాలంటే సబ్‌స్టేషన్ల నిర్మాణం తప్పనిసరి. చాలా సంవత్సరాల కిందట నిర్మించిన పాత సబ్‌స్టేషన్లు వాటి సామర్థ్యాన్ని కోల్పోవటమే కాకుండా వాటి నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రస్తుత సబ్‌స్టేషన్లపై విపరీతమైన లోడ్ పడుతోంది. ఓవర్ లోడ్ కారణంగా ఓల్టేజ్ డ్రాప్ అయి అవాంతరాలు ఏర్పడుతున్నాయి. కొత్త సబ్‌స్టేషన్లతో సమస్యలను అధిగమించడంతోపాటు ఓల్టేజ్‌ను స్థిరంగా ఉంచటానికి దోహదపడుతుంది. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రూఫ్ టాప్ సోలార్ ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తోంది. చాలామంది సోలార్ దిశగా అడుగులు వేస్తున్నారు. సోలార్ ద్వారా తయారయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించటానికి కూడా కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్ల ఏర్పాటు అవసరం. విద్యుత్ ఆధారిత వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, వ్యాపారాల వృద్ధికి విద్యుత్ వినియోగం మరింత అవసరం ఏర్పడుతుంది. ఉమ్మడి జిల్లాకు నూతన పెట్టుబడులను ఆహ్వానించాలన్నా తగిన సామర్థ్యంతో కూడిన విద్యుత్ మౌలిక సదుపాయాలు ఉండాల్సిన అవసరం ఎంతో ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఏపీసీపీడీసీఎల్ ఉమ్మడి కృష్ణా జిల్లాలో 24 సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచింది.

విజయవాడ టౌన్ పరిధిలో..

బెజవాడ టౌన్ డివిజన్ పరిధిలో మొత్తం 7 సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలిచారు. అమరావతి సబ్ డివిజన్‌లోని తాడికొండ నియోజకవర్గంలో అవుట్‌డోర్ సబ్‌స్టేషన్, మంగళగిరి నియోజకవర్గంలో గౌతమ్ బుద్ధ రోడ్డులో సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్, చిలకలూరిపేట సబ్ డివిజన్ పరిధిలోని తాడికొండ నియోజకవర్గంలో సిరిపురం, చిలకలూరిపేట నియోజకవర్గం సోలాసలో అవుట్ డోర్ సబ్‌స్టేషన్లకు, విజయవాడ టౌన్ పరిధిలోని సెంట్రల్ నియోజకవర్గంలోని గవర్నర్‌పేట, గాంధీనగర్, పశ్చిమ నియజకవర్గం ఆర్‌ఆర్ నగర్‌లో మొత్తం 3 సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్లు నిర్మించటానికి టెండర్లు పిలిచారు.

ఎన్టీఆర్ జిల్లా పరిధిలో..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 9 సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలవటం జరిగింది. గుణదల డివిజన్ పరిధిలో గన్నవరం నియోజకవర్గం రామవరప్పాడులో అవుట్‌డోర్ సబ్‌స్టేషన్, పెనమలూరు నియోజకవర్గంలోని పోరంకిలో సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్, పెదపులిపాకలో అవుట్ డోర్ సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలిచారు. నూజివీడు డివిజన్ పరిధిలో సింగన్నగూడెం, కొర్లగుంటలలో 2 అవుట్ రోడ్ సబ్‌స్టేషన్స్, తిరువూరు నియోజకవర్గంలోని నెమలిలో అవుట్ డోర్ సబ్‌స్టేషన్‌కు టెండర్లు పిలిచారు. విజయవాడ రూరల్ డివిజన్ పరిధిలో మైలవరం నియోజకవర్గంలో కిలేశపురంలో అవుట్‌డోర్, నందిగామ నియోజకవర్గం నందిగామలో అవుట్‌డోర్, జగ్గయ్యపేట నియోజకవర్గం ముక్కపేటలో అవుట్‌డోర్ సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలిచారు.

కృష్ణాజిల్లా పరిధిలో..

కృష్ణా జిల్లా వ్యాప్తంగా మొత్తం 8 సబ్‌స్టేషన్లకు ఏపీసీపీడీసీఎల్ టెండర్లు పిలిచింది. గుడివాడ డివిజన్ పరిధిలో కైకలూరు నియోజకవర్గం చినతాడినాడలో అవుట్‌డోర్, కొండంగిలో అవుట్‌డోర్, గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడటౌన్‌లో సెమీ ఇండోర్, మచిలీపట్నం డివిజన్ పరిధిలో మచిలీపట్నం టౌన్ పరిధిలోని జనార్ధనపురంలో సెమీ ఇండోర్, పెడన నియోజకవర్గంలోని గరిశపూడిలో అవుట్‌డోర్, పామర్రు నియోజకవర్గంలోని కూచిపూడిలో అవుట్‌డోర్, వుయ్యూరు డివిజన్ పరిధిలోని వుయ్యూరులో అవుట్‌డోర్, అవనిగడ్డ నియోజకవర్గంలోని ఎదురుమొండిలో అవుట్‌డోర్ సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలిచారు.

దేశానికే ఐకాన్ సెంటర్‌గా

మంగినపూడి బీచ్


- రూ.157 కోట్లతో భారీ వినోదాత్మక పార్కు కం రిసార్ట్స్
- మరో రెండు మెగా కంపెనీల సుముఖత
- మంత్రి కొల్లు రవీంద్ర



మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, పక్కన కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడి బీచ్‌ను పర్యాటకులను ఆకర్షించేలా దేశంలోనే గొప్ప ఐకాన్ సెంటర్‌గా రూపొందిస్తామని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం ఐదురోడ్ల సెంటర్‌లో సోమవారం మంత్రి రవీంద్ర మీడియాతో మాట్లాడారు. బీచ్‌లో రూ.157 కోట్లతో నిర్మించేందుకు వచ్చిన మైరా బే వ్యూ రిసార్ట్స్ సంస్థకు 20 ఎకరాలు కేటాయించామన్నారు. వినోదానికి, ఆతిథ్యానికి కేరాఫ్‌గా బీచ్‌ను రూపొందిస్తారన్నారు. ఎంయూజ్‌మెంట్, వాటర్ పార్క్ లు, రైడ్‌లు, రిసార్ట్‌లు, కన్వెన్షన్ సెంటర్లు, వెల్నెస్ స్పా, స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు కానున్నాయన్నారు. దీని వల్ల 1000 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి లీజు ద్వారా రూ. 12 కోట్ల ఆదాయం లభిస్తుందన్నారు. అదే విధంగా ఇతర రాష్ట్రాలకు చెందిన మరికొన్ని మెగా సంస్థలు బీచ్‌లో వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించేందుకు వస్తున్నాయన్నారు. కేబినెట్ సమావేశంలో మచిలీపట్నం అభివృద్ధిపై చర్చించినట్టు మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.







మొక్కలకు ఆటోమేటిక్‌గా నీరు పంప్‌చేస్తున్న పరికరం, త్రీడీ పరికరం, నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ సిలబస్ వరకు స్టోర్‌చేసి ఉన్న ప్రొజెక్టర్

అద్భుత మేధస్సుతో అబ్బుర పరిచారు

- కలెక్టరేట్‌లో విద్యార్థుల ప్రదర్శన
- ప్రాజెక్టులు తిలకించిన కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నేటితరం పాఠశాల విద్యార్థులు టెక్నాలజీని ఉపయోగించి ఆవిష్కరణలతో ఔరా అనిపిస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జీఎన్‌ఆర్ ఎంసీ హైస్కూల్ విద్యార్థులు ఇంటా బయటా మానవ ప్రమేయం లేకుండా ఉపయోగపడే ప్రాజెక్టులను ప్రదర్శించారు. కాంతితో పనిచేసే విద్యుద్దీపాలు, పెరట్లో మొక్కలకు టెక్నాలజీతో నీటిని సరఫరా చేయడం, తరగతి గదిలో శబ్దకాలుష్యం, గదిలో తేమ, టెక్నాలజీతో త్రీడీ చిత్రాలు, వాయుకాలుష్యాన్ని తెలుసుకునే పలు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. నగరంలోని విద్యాధరపురానికి చెందిన జీఎన్‌ఆర్ ఎంసీ హైస్కూల్ విద్యార్థులు టెక్నాలజీని ఉపయోగించి అద్భుతమైన ప్రాజెక్టులు చేసి కలెక్టరేట్‌లో సందర్శనకు ఉంచారు. పదో తరగతి విద్యార్థులే అయినప్పటికీ అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించే తీరుకు చూసిన వారు ముగ్ధులయ్యారు. ప్రాజెక్టుల్లో ముఖ్యంగా త్రీడీ ప్రింటర్.. నెట్‌లో ఏదైనా డిజైన్‌ను చేసి దీనికి అనుసంధానం చేస్తే నిమిషాల వ్యవధిలో ప్రింట్ తీసి ఇస్తుంది. మెటీరియల్ వృథా తక్కువగా ఉంటుందని విద్యార్థులు పేర్కొన్నారు.

వాతావరణంలో కాంతిని బట్టి ఇంట్లో విద్యుద్దీపాలు వెలిగే ప్రాజెక్టు సందర్శకులను అబ్బురపరిచింది. కాంతి తక్కువగా ఉన్నప్పుడు ఇంట్లోని లైట్లు అవే వెలగడం, కాంతి ఎక్కువగా ఉన్నప్పుడు ఆగిపోయే విధంగా ఈ పరికరాన్ని తయారుచేశారు. వీటితో పాటు స్మార్ట్ స్కూల్ పేరుతో తయారుచేసిన ప్రాజెక్టు.. తరగది గదిలో తేమతో పాటు ధ్వనిని రికార్డు చేస్తుంది. వాతావరణంలో కాలుష్యాన్ని లెక్కిస్తుందని విద్యార్థులు తెలిపారు. కేవైఏన్ ప్రొజెక్టర్‌లో సుమారు 600 వీడియోలు నిక్షిప్తం చేసి నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ రెండో ఏడాది వరకు సిలబస్ మొత్తం పొందుపరిచారు. ఇందులో ఉన్న ఏ అంశాన్నైనా వీడియో సహా వివరిస్తుంది. దీనివలన విద్యార్థులందరికీ వీడియో చూపించి వివరించడం వలన అర్థమయ్యే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. దీనివలన భవిష్యత్తులో ఉపాధ్యాయులు చెప్పిన తరగతులు మళ్లీమళ్లీ చెప్పే ఇబ్బంది ఉండదన్నారు. ప్రదర్శనలను తిలకించిన కలెక్టర్ లక్ష్మీశ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మానవ ప్రమేయం లేకుండా స్మార్ట్‌గా, ఆటోమేటిక్‌గా పనిచేసే యంత్రాలతో మరిన్ని ప్రాజెక్టులు తయారుచేస్తామని, ముఖ్యంగా సామాన్య ప్రజలకు, దేశానికి ఉపయోగపడే ప్రాజెక్టులు తయారుచేయడమే తమ లక్ష్యమని పదోతరగతి విద్యార్థులు విజయ ప్రసాద్, హర్షవర్ధన్ పేర్కొన్నారు.

వాయుగండం!

(5వ పేజీ తరువాయి)

జమ కాకపోవడంతో మళ్లీ బీజీలు చెల్లించడం కష్టంగా మారిందని మిల్లర్లు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రేషన్ షాపుల ద్వారా ఇచ్చేందుకు రాష్ట్ర గోడౌన్‌లలో నిల్వ ఉంచేందుకు సీఎంఆర్ బియ్యం తీసుకోవడం ఇంతవరకు ప్రారంభించలేదని, తీసుకుంటే బిల్లులు త్వరితగతిన వచ్చేవని, ఈ నగదుతో తాము బీజీలు చూపడానికి అవకాశం ఉండేదని చెబుతున్నారు. సీఎంఆర్ బియ్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వెంటనే అనుమతులు ఇవ్వాలని, లేనిపక్షంలో బీజీని 1:1 పద్ధతికి బదులుగా 1:2 పద్ధతికి మార్చాలని మిల్లర్లు కోరుతున్నారు.

నేలవాలుతున్న వరి

దిత్వా తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న చిరు జల్లుల కారణంగా కోతకు సిద్ధమైన వరి తడిచి, బరువెక్కి నిదానంగా నేలవాలిపోతోంది. వర్షంలో కంకులు నానిపోయి గింజల్లో నూకశాతం పెరిగే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. మరో రెండు రోజుల పాటు వాతావరణం ఇలానే ఉంటే రాశులుగా పోసి, పరదాలు కప్పిన ధాన్యం ఆరబెట్టేందుకు అవకాశం ఉండదని, ఈ ధాన్యం రంగుమారుతుందని ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణ సరిహద్దులో నిలిచిపోతున్న ధాన్యం లారీలు

తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యాపారులతో మాట్లాడుకుని పలువురు స్థానిక వ్యాపారులు అక్కడకు ధాన్యం తరలిస్తున్నారు. గరికపాడు చెక్ పోస్టు దాటిన తర్వాత ధాన్యం లారీలను తెలంగాణ అధికారులు మీ ధాన్యం మీ రాష్ట్రంలోనే విక్రయించుకోవాలని చెబుతూ నిలిపి వేస్తున్నారని వ్యాపారులు అంటున్నారు. కానీ తెలంగాణ నుంచి మండపేట, తదితర ప్రాంతాలకు వస్తున్న ధాన్యానికి ఒకశాతం సెస్ కట్టించుకుని అనుమతి ఇస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని జిల్లాలోని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

బుడమేరు యూటీ విస్తరణ

(5వ పేజీ తరువాయి)

15 సార్లు వరదలొచ్చాయి. 16వ సారి.. అంటే గత ఏడాది వరదలకు 30 వేల క్యూసెక్కుల నీరు వచ్చింది. యూటీ సామర్థ్యం సరిపోక వరదలు సంభవించాయి. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి వచ్చినా నీరు సాఫీగా ముందుకెళ్లేందుకు వీలుగా యూటీ సామర్థ్యాన్ని పెంచాలని అధికారులు నిర్ణయించారు. 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోకు తగ్గట్టుగా యూటీని మార్చనున్నారు. దీనికి సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

పోస్టుమేన్ ఘరానా మోసం

(5వ పేజీ తరువాయి)

ఇచ్చేవారు. కానీ శేఖర్ ఆ డబ్బును జమ చేయకుండా చేశానని నమ్మబలికి ఖాతాదారులను మభ్యపెట్టాడు. ఇలా కొంత కాలం డిపాజిట్లను కట్టించుకుని, తన దగ్గర డిపాజిటర్లు ఉంచిన 300 పాస్ పుస్తకాలు, డిపాజిటర్లు కట్టిన నగదును తీసుకుని గత నెల 25వ తేదీన అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి శేఖర్ తమ దగ్గరకు రాకపోవటం, కనిపించకపోవటంతో ఖాతాదారులకు అనుమానం వచ్చి విచారించగా అసలు విషయం తెలిసింది. దీంతో ఖాతాదారులు తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమంటున్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

పోస్టాఫీసులో డిపాజిటర్ల సొమ్ము సుమారు రూ.50 లక్షలు కాజేసి పరారైన పోస్ట్‌మేన్ శేఖర్‌పై ఉంగుటూరు పోలీస్‌స్టేషన్లో పోస్టల్‌శాఖ గుడివాడ సబ్‌డివిజనల్ ఇన్‌స్పెక్టర్ బి.విజయ్ ఖాతాదారులతో కలిసి సోమవారం ఫిర్యాదు చేశారు.

ప్రాథమిక తనిఖీల్లో నగదు మళ్లింపును గుర్తించాం

- భూక్యా విజయ్, గుడివాడ సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్



ఖాతాదారుల పాస్‌పుస్తకాలను తనిఖీ చేస్తున్న గుడివాడ సబ్‌డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విజయ్

ఉంగుటూరు సబ్‌పోస్టాఫీసులో సుమారు 3 వేల ఖాతాలు ఉండగా, ఇప్పటి వరకు 600 ఖాతాల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. ఇంకా 2,400 ఖాతాలు పరిశీలించాల్సి ఉంది. మొత్తం 300 పాస్‌పుస్తకాలు పోస్ట్‌మేన్ శేఖర్ ఆధీనంలో ఉన్నాయి. ప్రస్తుతం జరిపిన ప్రాథమిక తనిఖీల్లో సుమారు రూ.5 లక్షల మేర ఫ్రాడ్ జరిగినట్లు గుర్తించాం. ఖాతాదారులు తెలిపిన వివరాల ఆధారంగా సుమారు రూ.50 లక్షల వరకు సొమ్ము గోల్‌మాల్ జరిగి వుండవచ్చునని భావిస్తున్నాం. సమగ్ర విచారణ జరుపుతాం. ఖాతాదారులు కూడా సహకరించాలని కోరుతున్నాం.

సీపీఎస్ ఉద్యమం ఉధృతం చేస్తాం

- ఉద్యోగుల సంఘం

గాంధీనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వానికి ఇచ్చిన సమయం ముగిసిందని, ఇక ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర గడుస్తున్నా సీపీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని మండిపడ్డారు. కనీసం సీపీఎస్ ఊసే ఎత్తడం లేదని, గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా మోసం చేస్తుందా.. అని ప్రతి సీపీఎస్ ఉద్యోగి ఆవేదన చెందుతున్నాడని వారు పేర్కొన్నారు. పీఆర్సీ, డీఏ, సీపీఎస్ సమస్యను గాలికొదిలేసి ఉద్యోగులను తీవ్ర పని ఒత్తిడిలోకి నెట్టారని తెలిపారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 6 నుంచి మూడో విడత 'సీపీఎస్ ఉద్యోగుల చైతన్య యాత్ర' చేపట్టనున్నట్టు తెలిపారు. కోనసీమ జిల్లాలో ప్రారంభించి 10వ తేదీన శ్రీకాకుళంలో ముగిస్తామని వారు వివరించారు.

పంచాయతీల పంచన..

(5వ పేజీ తరువాయి)

వల్ల దగ్గరగా ఉన్నవాటిని కలిపే అవకాశాలను పరిశీలించాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. మేకావానిపాలెం పంచాయతీలో నవీన్ మిట్టల్ కాలనీ అనుబంధంగా ఉంది. ఇందులో 1,300 మంది పైబడి జనాభా ఉంటున్నారు. దీనిని ప్రత్యేక పంచాయతీగా మార్చాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. పోతేపల్లి పంచాయతీకి ఉల్లిపాలెం గ్రామం అనుబంధంగా ఉంది. ఇక్కడ 1,200 మంది జనాభా నివసిస్తున్నారు. ఈ గ్రామాన్ని కూడా ప్రత్యేక పంచాయతీగా మార్చాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

- బంటుమిల్లి మండలంలోని పలు గ్రామాలు వేర్వేరు మండలాల్లో ఉన్నాయి. వీటిని ఒకే మండలం పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్ వస్తోంది. నరసప్ప గ్రామం పెదతుమ్మిడి పంచాయతీకి అనుబంధంగా ఉంది. నరసప్ప గ్రామంలో కొంత పెడన మండలంలోని ఉరిమి గ్రామంలో కూడా ఉంది. అలాగే, బంటుమిల్లి మండలంలోని మలపరాజగూడెం పంచాయతీలో ఒక భాగం నారాయణపురం, మరో భాగం ముదినేపల్లి మండలం ఊటుకూరు పంచాయతీలో ఉంది. పి.రావిగుంట గ్రామం.. ముదినేపల్లి మండలంలో ఉండగా, సి.రావిగుంట మాత్రం బంటుమిల్లిలో ఉంది. దగ్గరగా ఉన్న ఒకే మండలం పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్ వస్తోంది.
- కోడూరు మండలంలో 4 వేల మంది జనాభా కలిగిన విశ్వనాథపల్లి పంచాయతీకి కుమ్మరిపాలెం గ్రామం అనుబంధంగా ఉంది. ఈ గ్రామంలో జనాభా 2 వేలు. డ్రెయిన్లు, పారిశుధ్యం లేవు. దీంతో ప్రత్యేక పంచాయతీ డిమాండ్ వ్యక్తమవుతోంది. వెంకటాపురం అనే గ్రామం మోపిదేవి మండలంలో ఉంది. ఈ సమస్యను కూడా పరిష్కరించాలన్న డిమాండ్ వస్తోంది.

ప్రతిపాదనలు వస్తే ప్రభుత్వానికి పంపిస్తాం

పంచాయతీల విభజనకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం ఉన్న నిషేధం ఎత్తివేసిన నేపథ్యంలో అవకాశాలకు దారులు పడ్డాయి. గ్రామాల నుంచి ప్రత్యేక పంచాయతీలు కావాలని ప్రతిపాదనలు వస్తే తక్షణం పరిశీలించి డీపీవో ద్వారా కలెక్టర్‌కు పంపి, అక్కడి నుంచి ప్రభుత్వానికి అందజేస్తాం.

- ఎండీ రజావుల్లా, డీఎల్‌పీవో, మచిలీపట్నం

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

జమలాపురానికి బస్సు సర్వీసు ప్రారంభం

గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గన్నవరం నుంచి జమలాపురానికి బస్సు సర్వీసు ప్రారంభించామని, ఈ సర్వీసుకు స్త్రీ శక్తి పథకం అమలు చేస్తున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు గన్నవరం డిపోలో బస్సు బయలుదేరి 8.15కు జమలాపురం, అక్కడ నుంచి 9.15కు కంచికచర్ల చేరుతుందన్నారు. కంచికచర్ల నుంచి బయలుదేరి జమలాపురం 10.30కి చేరి, గన్నవరానికి 12.45కు వస్తుందని, రెండవ ట్రిప్ మధ్యాహ్నం 1.15కు బయలుదేరి, 2.45కు మైలవరం చేరుతుందని, అక్కడ 3 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.30కు గన్నవరం చేరుతుందని, సాయంత్రం 5గంటలకు బయలుదేరి 6.30కి మైలవరం అక్కడ నుంచి 6.45కు బయలుదేరి రాత్రి 8.15కు గన్నవరం డిపోకు చేరుతుందని పేర్కొన్నారు.






బాపులపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు.. రంగన్నగూడెంలో ఆళ్ల .. అల్లాపురంలో కోటేశ్వరరావు.. కానూరులో శంకరబాబు

పేదలకు భరోసా పింఛన్లు

ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్

విజయవాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం పాతపాడులో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి నెలా 40, 877 మంది లబ్ధిదారులకు రూ. 17.53 కోట్లు పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు నెల కొత్తగా మరో 50 మందికి నూతన పింఛన్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య, రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు గొడ్డళ్ళ చిన్నరామారావు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసి ప్రజారంజక పాలన ఇవ్వడానికి కృషి చేస్తోందని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం బాపులపాడు నిర్వహించారు. టీడీపీ నాయకులు అట్లూరి శ్రీనివాసరావు దుట్టా శివన్నారాయణ, చిన్నాల లక్ష్మీనారాయణ, తాడిశెట్టి శ్రీను, కడవకొల్లు రాజేష్, కొండా నాగరాజు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పేదలకు ఎన్టీఆర్



కంకిపాడులో..




పాతపాడు, యనమలకుదురులో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్

భరోసా పెన్షన్లు అండగా నిలుస్తున్నాయని ఆళ్ల గోపాలకృష్ణ, గుండవనేని ఉమావరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు వేర్వేరు కార్యక్రమాల్లో అన్నారు. బాపులపాడు మండల వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే చంద్రబాబు లక్ష్యం

గన్నవరం: పేదల అభ్యున్నతే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే పెన్షన్‌లు పెంచి పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కు తుందన్నారు. మండలంలోని అల్లాపురంలో సోమవారం పెన్షన్‌లను పంపిణీ చేశారు. కార్యదర్శి ఉమామహేశ్వరరావు, నూరిబోయిన రాంబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. కేసరపల్లిలో టీడీపీ నేత చిరుమామిళ్ల సూర్యం పెన్షన్‌లను పంపిణీ చేశారు.

పెనమలూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. టీడీపీ కూటమి నేతలు పింఛన్లను అధికారుల సాయంతో పంపిణీ చేశారు. యనమలకుదురు డొంకరోడ్డులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెంట మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్, స్థానిక టీడీపీ కూటమి నేతలు అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, తాడిశెట్టి వీరాస్వామి, తమ్ము అశోక్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. పోరంకిలో అనుమోలు ప్రభాకరరావు పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. చెన్నుపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కానూరు: కానూరులో వెలగపూడి శంకరబాబు అధికారులతో కలిసి పింఛన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్‌లు అందజేస్తున్నామని తెలిపారు.

95 శాతం పింఛన్లు పంపిణీ

కంకిపాడు : మండలంలోని వివిధ గ్రామాల్లో 95 శాతం మందికి పింఛన్ పంపిణీ చేసినట్టు టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. కంకిపాడులో సోమవారం నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పార్టీ నాయకులు పులి శ్రీనివాసరావు, చిట్టూరి నాగేశ్వరరావు, చలవాది రాజ, కొండా నాగేశ్వరరావు, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, ఏనుగ జయప్రకాష్, చలవాది రాజ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తున్న బాబు

ఉయ్యూరు : సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు 10, 13, 14 వార్డుల్లో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు సోమవారం పంపిణీ చేశారు. కాటూరులో ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, వేమూరు శ్రీనివాసరావు, ఏంపీడీఓ శేషగిరిరావు, కోటేశ్వరరావు, రవి పెన్షన్‌లు పంపిణీ చేశారు. గండిగుంటలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, ఉపసర్పంచ్ రాంబాబు, కోటేశ్వరరావు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద ఓగిరాలలో టీడీపీ నాయకుడు పోతిరెడ్డి, ఇతర నాయకులు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఉయ్యూరులో..



నున్నలో ఐడియల్ హార్ట్ అండ్ హెల్త్ కేర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

వైద్య సేవలు గ్రామాలకు విస్తరించాలి

విజయవాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అధునాతన వైద్య సేవలు నగరాలకే పరిమితం కాకుండా గ్రామాలకు విస్తరించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్నలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐడియల్ హార్ట్ అండ్ హెల్త్‌కేర్ ఆసుపత్రిని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెట్రో నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రి నుంచి ఆకర్షణీయమైన అవకాశాలు వచ్చినా గ్రామీణ ప్రాంతంలో హార్ట్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసిన కార్డియాలజిస్టు డాక్టర్ పొలారెడ్డి దినేష్‌రెడ్డిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, నున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.



కోడూరుపాడులో రైతులకు సూచనలిస్తున్న ఏవో రంగనాథ్‌బాబు

రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రమాదం తప్పినా అల్పపీడన కారణంగా చెదురుమదురు జల్లులు పడుతున్నాయని ధాన్యం తడవకుండా రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏవో రంగనాథ్‌బాబు సూచించారు. వీరవల్లి, కోడూరుపాడుల్లో సోమవారం పర్యటిస్తూ రైతులకు సూచనలిచ్చారు. ధాన్యం తడవ కుండా టార్పాలిన్‌లను ఆయా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

పెనమలూరు: ప్రస్తుత తుపాను కారణంగా మండలంలోని రైతులు రెండు రోజుల పాటు వరి కోతలు నిలిపివేయడం మంచిదని మండల ఏవో శైలజ రైతులకు సూచించారు. సోమవారం పోరంకిలో రైతులతో ఏవో మాట్లాడుతూ, ఇంతకుముందే పంట కోసిన రైతులకు ధాన్యం ఆరబెట్టడానికి రెండు వందలకు పైగా టార్పాలిన్లను అందజేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఏవో కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఆరబోసిన ధాన్యాన్ని సందర్శించి పట్టాలు కప్పాలని, రెండు రోజుల పాటు వరి కోతలు ఆపాలన్నారు.

ఎన్జీవోస్ అసోసియేషన్ నామినేషన్స్ 6న

గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ విశేష కృషి చేస్తుందని అధ్యక్షులు వి.సాంబశివరావు అన్నారు. ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ గన్నవరం తాలూకా నూతన కార్యవర్గ ఏర్పాట్లకు నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి ఎ.నగేష్‌బాబు సోమవారం విడుదల చేశారు. ఈ నెల 6న నామినేషన్స్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావు మా ట్లాడుతూ ఎన్జీవోస్ అసోసియేషన్ హాల్ నందు నామినేషన్స్ ప్రక్రియ ప్రారంభం అవుతున్నారు. నాయకులు రాంబాబు, కృష్ణమోహన్, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



అడ్మిషన్ల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సిద్దార్థ అకాడమి అధ్యక్ష, కార్యదర్శులు రాజయ్య, లక్ష్మణరావు, వీసీ, ప్రో. వీసీ తదితరులు

సిద్ధార్థ వర్సిటీ అడ్మిషన్స్ బ్రోచర్ ఆవిష్కరణ

కానూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి బీటెక్ అడ్మిషన్ల బ్రోచర్, పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమి అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రాజయ్య, పి. లక్ష్మణరావు, వైస్‌చాన్సలర్ పి. వెంకటేశ్వరరావు, ప్రో. వీసీ ఏవీ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం 6న

గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.స్వర్ణలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖ అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 6న ఉదయం 10.30గంటలకు ఎంపీపీ వై.నగేష్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె. జోగేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

మౌలిక సౌకర్యాల కల్పనే కూటమి లక్ష్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలకు మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యంగా కోట్లాది నిధులు వెచ్చించి సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆదివారం తాడిగడప కేసీపీ కాలనీలో షుమారు రూ. 70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించి మా ట్లాడారు. ప్రజలకు సేవచేస్తే నాయకులను తమ కుటుంబసభ్యులుగా భావించి గౌరవిస్తారని, కష్టపడి పనిచేస్తే కాస్త అలిసిపోతామేమో గానీ ప్రజల ఆదరాభిమానాల ముందు ఏకష్టమైనా ఇబ్బంది ఉండదని అన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ఆశీర్వాదాలతో ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న ఆలోచనతో పని చేస్తున్నామని, నియోజకవర్గ పరిధిలోని తాడిగడప మునిసిపాలిటీలో ఏడాదిన్నర కాలంగా కోట్లాది రూపాయలను వివిధ శాఖల ద్వారా మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఖర్చు చేస్తున్నామని తెలిపారు. కానూరు, తాడిగడప, పోరంకి, యనమలకుదురు గ్రామాల్లో సీసీ రోడ్ల మరమ్మతులు చేయడంతో పాటు వందలాది కిలోమీటర్ల పొడవైన సీసీ రోడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, కుర్రా నరేంద్ర, యార్లగడ్డ సుచిత్ర, యార్లగడ్డ రూప్‌కుమార్, కన్నెగంటి సుబ్బారావు, ఉమామహేశ్వరరావు, శరత్, కళ్యాణి, కొల్లి బుజ్జి, వేణు, రాజగోపాల్, యార్లగడ్డ మోహనకృష్ణ, సుబ్రహ్మణ్యేశ్వరరావు, దోనేపూడి రవికిరణ్, మల్లంపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.



కేసీపీ కాలనీలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కంకిపాడు : విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరముందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని వేల్పూరులో ఎస్ఆర్‌కే కాలేజీ విద్యార్థులు నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని రోడ్లు ఊడ్చారు. రోడ్డు మార్జిన్‌లో ఉన్న చెత్తను ఎత్తి ట్రాక్టర్లలో వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు నేడు ఫోన్లకు ఎక్కువ అలవాటు పడిపోయారన్నారు. సామాజిక బాధ్యతల నుంచి దూరంగా వెళ్లి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని గంజాయి వనంగా వైసీపీ మార్చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ వేరివేత కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో కూడిన ఆరోగ్యం అయ్యప్పదీక్ష

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కఠోర నియమాలను పాటిస్తూ చేసే అయ్యప్పదీక్ష ఆధ్యాత్మికతతో కూడిన ఆరోగ్యకరమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. సింగన్నగూడెంలో మరీదు తిరుపతిరావు ఆధ్వర్యంలో రామ్మోహనరావు గురుస్వామి పర్యవేక్షణలో ఆదివారం రాత్రి నిర్వహించిన మహాపడిపూజ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల గోపాలకృష్ణ, పుసులూరి లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణారావు, బత్తిన గంగాధరరావు, వడ్లమూడి జానకిరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

కానూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ జరిగింది. ఈర్యాలీని వర్సిటీ వీసీ పి. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీసీ వెంకటేశ్వరరావు, ప్రో. వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్ ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జె. శివరాంప్రసాద్, డాక్టర్ పి. సుష్మాచౌదరి, వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు నరేందర్, శ్రీనివాసరావు, నీలాంబరం, వాలంటీర్లు పాల్గొన్నారు.

కంకిపాడు : ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రయత్నించాలని, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అంజు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.సిబ్బంది కృష్ణారావు, రాజమణి, శారమ్మ పాల్గొన్నారు.

ఉయ్యూరు: హెచ్ఐవీ ఎయిడ్స్ పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని కాటూరులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏజీ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ పి. మురళి, చైర్మన్ మండవ జయదేవ్ పాల్గొన్నారు.

నవోదయలో బిర్యానీ రచ్చపై విచారణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : వేలేరు, జవహర్ నవోదయ విద్యాలయం హాస్టల్‌లో బయట నుంచి తెచ్చుకున్న బిర్యానీ వ్యవహారంపై సోమవారం అధికారులు విచారణ నిర్వహించారు. బయట హోటళ్ల నుంచి బిర్యాని హాస్టల్‌కు వస్తున్న విషయం ఉపాధ్యాయులకు తెలియడంతో నిఘా పెట్టి బిర్యాని పార్శిల్స్ తీసుకొస్తున్న వారిని హెచ్చరించడంతో పాటు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న కొంత మంది విద్యార్థులను ఇంటికి పంపి తల్లిదండ్రులను తీసుకు రావలన్నారు. ఈ నేపథ్యంలో జగ్గయ్యపేటకు చెందిన విద్యార్థి నన్ను హాస్టల్ వార్డెన్ తీవ్రంగా కొట్టారని సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడంతో ఇవి వైరల్‌గా మారాయి. ఈ ఆరోపణలపై బాపులపాడు మండల విద్యాశాఖాధికారి2 విజయ్, ప్రిన్సిపాల్ ఏదునందన సోమవారం క్షేత్ర స్థాయిలో తనిఖీ నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి నివేదిక రూపొందించారు. ఈ నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని లయన్స్ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్షులు దండమూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దావాజీగూడెం ఎన్‌టిటిఎఫ్ కళాశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.మహిధర్, కె.పద్మ జ, లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసు, ఎంఎల్ఎస్‌కె ప్రసాద్, మూల్పూరి సురేష్, సాంబశివరావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు గన్నవరం బాలోత్సవాన్ని ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం బాలోత్సవం నాలుగవ పిల్లల పండుగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బాలోత్సవ కార్యనిర్వాహక అధ్యక్షులు గన్నె వెంకట్రావు ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్, ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చలి చలిగా అల్లింది

● శీతాకాలంలో టిబెటన్ల ఉన్ని దుస్తులకు భలే డిమాండ్ ● గాంధీనగర్ కేంద్రంగా పలు స్టాళ్లలో విక్రయాలు

శీతాకాలం ప్రారంభమైంది. ఉదయపు వేళల్లో దారులన్నీ మంచు దుప్పటిని కప్పుకుంటున్నాయి. సాయంత్రం ఆరు అయ్యిందంటే చాలు శీతలగాలులు చెలరేగిపోతున్నాయి. చల్లని వాయువుల అంతర శరీరాన్ని కుదిపేస్తున్నాయి. దగ్గు, జలుబు పట్టిపీడిస్తున్నాయి. ఏటా నవంబరు నుంచి ప్రారంభమయ్యే తంతే ఇదంతా.. సమశీతోష్ణ స్థితికి అలవాటు పడిన శరీరానికి ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులను తట్టుకోవడం కాస్త ఇబ్బందికరమే. వీటినుంచి గట్టెక్కేందుకు ఏకైక మార్గం స్వెట్టర్. - ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ

ప్రభుత్వ సహకారంతోనే విక్రయాలు
డెచన్, షాప్ యజమాని

ఏటా అక్టోబరులో సరుకుతో వస్తాము. వెంటనే స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో వీఎంసీ అధికారులు, స్థానిక పోలీసులను సంప్రదిస్తాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వీఎంసీ, పోలీస్ నుంచి అనుమతులు వస్తాయి. టిబెటన్ రెఫ్యూజీ ట్రేడర్స్ క్యాంపులు దేశంలో చాలా ప్రదేశాల్లో ఉంటాయి. విజయవాడలో ప్రజలు, ప్రభుత్వం, స్థానిక సంస్థల సహకారం మరెక్కడా ఉండదు. అందుకే విజయవాడలో షాప్ కోసం మావాళ్ల ఎగబడతారు.

ఈ ఏడాది ఆకర్షణీయ రంగుల్లో దుస్తులు: సోమా, షాప్ యజమాని

ఈ ఏడాది మంచి మంచి రంగుల్లో స్వెట్టర్స్, జర్కిన్స్ తీసుకొచ్చాం. అందరూ ఇష్టంగా కొంటున్నారు. చిన్న పిల్లలైతే హియర్ క్యాప్స్ ఎక్కువగా ఇష్టపడుతున్నారు. కలర్ స్వెట్టర్స్‌ను యూత్ ఎక్కువగా ఇష్టపడుతోంది. ప్రస్తుతం చలి పెరుగుతున్న దృష్ట్యా వ్యాపారం ఊపందుకుంది. మరో 2 నెలలు ఇక్కడే ఉంటాము.

అందరికీ అందుబాటు ధరల్లోనే..: లామో, షాప్ యజమాని

క్వాలిటీ కోరుకోవడం విజయవాడ ప్రజల స్పెషల్. స్వెట్టర్, ఇతర దుస్తులు కొనేందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ నాణ్యతను చెక్ చేస్తారు. దారాల నుంచి రంగు వరకు అన్నింటినీ క్షుణ్ణంగా పరీక్షిస్తారు. అందుకే విజయవాడలో క్యాంప్ ఏర్పాటు చేసుకునే మేము ముందుగానే క్వాలిటీ దుస్తులను మాత్రమే తీసుకొస్తాం. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లోనే అమ్ముతాము.



మన దైనందిన ఉరకుల పరుగుల జీవితంలో అధిక సంఖ్యాకుల దినచర్య ఉదయం 5 గంటల తరువాత ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుంది. రోజువారీ కూలీలు, చిరు వ్యాపారుల నుంచి ఉన్నత ఉద్యోగులు, బడా వ్యాపారవేత్తల వరకు ఇదే కాలపట్టిక. ఉదయం మంచు నుంచీ రాత్రి చలిగాలుల నుంచి తట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ స్థోమతకు తగినట్టు స్వెట్టర్లు వినియోగిస్తారు. వణికించే చలిలో స్వెట్టర్ లేకుంటే బయటకు రావడం కష్టమే.

చలిని తట్టుకునే దుస్తులన్నీ గాంధీనగర్‌లోనే..

చలిని తట్టుకునే దుస్తుల విక్రయాలకు నగరంలోని గాంధీనగర్‌లోని అలంకార్ రోడ్డు చిరునామాగా మారింది. టిబెట్ దేశానికి చెందిన 17 కుటుంబాలు టిబెటన్ రెఫ్యూజీ ట్రేడర్స్ పేరుతో సంఘంగా ఏర్పడి దాదాపు 40 ఏళ్లుగా చలి నుంచి ఉపశమనం పొందే వస్త్రాలను అందుబాటులో ఉంచుతున్నారు. పంజాబ్‌లోని లూథియానా కార్మాగారాల్లో తయారైన దుస్తులను, ఢిల్లీ, పంజాబ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రజలు స్వయంగా చేతితో అల్లిన ఊలు దుస్తులను సేకరించి స్థానికంగా విక్రయిస్తున్నారు. చంటిబిడ్డల నుంచి వృదుధల వరకు, తల నుంచి అరికాలు వరకు కప్పుకునే అన్ని రకాల దుస్తులు వీరి వద్ద ఉంటాయి. ఏటా అక్టోబరులో పూర్తి స్థాయి సరుకుతో విజయవాడకు వచ్చి, ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకుని తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని విక్రయాలు ప్రారంభిస్తారు. సంక్రాంతి వరకు విక్రయాలు జరిపి, తరువాత తమ స్వస్థలాలకు వెళ్లిపోతారు. నగరం మొత్తంలో వీరివద్ద మాత్రమే అన్నిరకాల చలిని తట్టుకునే దుస్తులు దొరుకుతాయి.

ఆకర్షణీయమైన దుస్తులు

స్వెట్టర్స్, జర్కిన్స్, స్లీవ్‌లెస్ బన్నీలు, బ్లాంకెట్స్, మంకీ క్యాప్స్, రెయిన్ కోట్స్, నెక్ క్యాప్స్ వీరి వద్ద ఉంటాయి. నేటితరం అభిరుచులకు అనుగుణంగా రంగురంగుల దుస్తులను ఈ ఏడాది అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం చిన్నారులు చెవులకు ఇష్టంగా ధరించే ట్రెండింగ్ హియర్ క్యాప్స్‌తో టిబెట్ వ్యాపారులు ప్రజలను ఆకట్టుకుంటున్నారు. వీరివద్ద ఉండే ప్రతి వస్త్రానికి లోపల ఉడ్డీస్ ఫినిషింగ్ ఉంటుంది. చలి పెరుగుతున్న తరుణంలో ప్రజలు వీటి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు.











5న పేరెంట్స్, టీచర్స్ సమావేశం

● కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఈనెల 5న టీచర్స్, పేరెంట్స్ సమావేశం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మూడోసారి ఈ సమావేశం నిర్వహించేందుకు ప్రణాళికను రూపొందించామన్నారు. ప్రాథమిక, ఉన్నతపాఠశాలలతోపాటు, జూనియర్ కళాశాలల్లో ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు చదువులో ఎంతగా రాణిస్తున్నారు, పిల్లలు మరింతగా పురోగతి సాధించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమవంతుగా ఏం చేయాలనే అంశంపై వివరించడం జరుగుతుందన్నారు. పిల్లలకు వచ్చిన మార్కులను తెలియజేసే పురోగతికార్డులను అందిస్తామన్నారు. వారు చదువులో రాణించడానికి ఏం చేయాలనే అంశంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు. రానున్న వందరోజుల్లో కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పిల్లలను చదివించే విధానంపై తల్లిదండ్రులకు ఒక నివేదికను అందజేస్తామన్నారు. ఈ ప్రణాళికను అమలులో తల్లిదండ్రులు శ్రద్ధతీసుకుంటే గతంలో విద్యార్థినీ, విద్యార్థులు చదివిన తీరుకు, ప్రస్తుతం చదివే తీరును గమనించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. పిల్లల తల్లిదండ్రులు ఈనెల 5న జరిగే సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ కోరారు. డీఈవో పీవీజే రామారావు పాల్గొన్నారు.



ప్రజల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

● ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చట్టపరిధిలోని ప్రజాసమస్యలను తక్షణం పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. మీ కోసంలో భాగంగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ వినతి పత్రాలు స్వీకరించారు. 35 మంది ఎస్పీకి, ఏఎస్పీ వీవీ నాయుడుకు వినతి పత్రాలు సమర్పించారు. తన వద్ద అప్పుగా తీసుకున్న సొమ్ము తిరిగి ఇవ్వకుండా బలవంతంగా చెక్కులు రాయించుకుని దొమ్మీగా కొట్టేందుకు వస్తున్నారని అవనిగడ్డకు చెందిన సుందర్ ఫిర్యాదు చేశాడు. అలాగే పెళ్లయి మూడేళ్లయిందని అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని, చిత్రహింసలకు గురి చేస్తున్నారని పెనమలూరుకు చెందిన సీత ఫిర్యాదు చేశారు. ఉద్యోగం ఇప్పిస్తానని తన స్నేహితుడు రూ.2 లక్షలు తీసుకున్నాడని, డబ్బులు తిరిగివ్వకుండా బెదిరింపులకు దిగుతున్నాడని బంటుమిల్లికి చెందిన సాకేత్ తన గోడు వినిపించుకున్నాడు.



క్రీడాకారులతో ఇన్‌చార్జి సర్పంచ్ పాలడుగు నాని

రాష్ట్రస్థాయి రగ్బీ విజేతలు కర్నూలు జట్లు

గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రెండు రోజులుగా గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 బాల,బాలికల రగ్బీ చాంపియన్ షిప్ పోటీల్లో కర్నూల్ బాలబాలికల జట్లు విజేతగా నిలిచాయి. అలాగే బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో కృష్ణా, తృతీయ స్థానం కడప జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖ జట్టు ద్వితీయ స్థానం, గుంటూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ పాలడుగు వెంకట రామవరప్రసాద్ (నాని) మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తేనే ఉన్నత భవిష్యత్ ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన టీములను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్లు సత్తాచూపి జాతీయ పోటీల్లో పతకాలను కైవసం చేసువాలని కోరారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, హెచ్ఎంలు ఏ సునీల, కేఎస్ జగదీశ్వరరావు, విద్యా కమిటీ చైర్ పర్సన్ సీహెచ్ ఎస్తేరు సుచరిత, కృష్ణాజిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శులు ఎం అరుణ, జీ రాంబాబు, రిటైర్డ్ పీడీ రాఘవేంద్రరావు, నియోజక వర్గ క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు, ఎస్ సుబ్బారావు పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన క్రీడాకారుల పరిచయానికి విచ్చేసిన గుడివాడ డివిజన్ ఉప విద్యాశాఖధికారి కొండా రవి కుమార్, మండల విద్యా శాఖాధికారిణి ఆర్ కమల శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్యకర సమాజంతోనే వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర

● ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సభలో మంత్రి సత్యకుమార్

వన్‌టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర సమాజంతోనే వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధ్యమవుతాయని మంత్రి సత్యకుమార్ అన్నారు 2030 నాటికి రాష్ట్రం ఎయిడ్స్ రహితంగా ఉండేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల వల్ల ఎయిడ్స్ పాజిటివిటీ రేటు 2.34 నుంచి 50 శాతానికి తగ్గిందన్నారు. అలాగే కొత్తగా 25వేల కేసుల నుంచి 13వేల కేసులకు తగ్గాయన్నారు. పాజిటివ్‌రేటు 0.10 నుంచి 0.04 శాతానికి తగ్గిందన్నారు. దాదాపు రూ.36వేల నుంచి రూ.40వేల ఖరీదైన యాంటీ రిట్రోవైరల్ మందులను 59 ఏఆర్ టీ సెంటర్ల ద్వారా అందిస్తున్న విధి విధానాలను వివరించారు. 15 మొబైల్ టెస్టింగ్ యూనిట్ల గురించి వివరించారు. 2030 నాటికి భారత్‌తో పాటు ఏపీసీ కూడా ఎయిడ్స్ రహితంగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

రాష్ట్రంలో 42వేల మంది హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులకు చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పెన్షన్లను అందజేస్తోందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటే ఉండే ఒక టప్పటి భయం ఇప్పుడు లేదన్నారు. కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన ఉన్నప్పుడే ఉత్తమ సమాజం ఏర్పాటవుతుందన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేబీఎన్ చక్రధరబాబు, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సమరం, నెట్‌వర్క్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రామమోహన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. స్నేహ, వాసవ్య మహిళామండలి, శాంతి కల్చరల్ సొసైటీ కళాజాతాల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు అనంతరం ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

కృష్ణాజిల్లా లారీ యజమానుల సంఘానికి అవార్డు

అత్యధిక ర క్తదానాలు, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న కృష్ణాజిల్లా లారీ యజమానుల సంఘం రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంది. తుమ్మలపల్లిలో సోమవారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సత్యకుమార్ ప్రారంభించి రక్తదానం చేశారు. అనంతరం నిర్వహించిన సభా కార్యక్రమంలో సంఘానికి అవార్డు ప్రకటించారు. అంతకుముందు నిర్వహించిన ర్యాలీలో విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు, కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ, ట్రక్కర్ ప్రాజెక్ట్ మేనేజర్ వీవీ సాంబశివ రావు పాల్గొన్నారు. సాంబశివరావును మంత్రి అభినందించి అవార్డు అందజేశారు

ప్రజారవాణా సంస్థ ఎన్ఎంయూఏ, ఈయూకు

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ శాశ్వత సభ్యత్వం

బస్టేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజారవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ), ప్రజారవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్‌కు సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ శాశ్వత సభ్యత్వం ఇవ్వడంపై సీఎం చంద్రబాబుకు యూనియన్ నేతలు సోమవారం కృతజ్ఞతాభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయా సంస్థల రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023 సెప్టెంబరు 9న తమ యూనియన్‌ను అతి పెద్దదిగా గుర్తించారని ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉద్యోగులకు సంబంధించి అన్ని అంశాలను సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి అతిపెద్ద యూనియన్‌గా చేస్తున్న కృషిని వివరించారు. అలాగే తమకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని అధికారులు ఉన్నతాధికారులతోపాటు సీఎంకు కూడా అనేకసార్లు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఆదేశాలతో ఒక రోజులోనే ఫైల్ ఆమోదం పొందడంపై సీఎం చంద్రబాబు, చీఫ్ సెక్రటరీ విజయానంద్ నుంచి వివిధ హోదాల్లో ఉన్న అధికారులకు, ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుకు ధన్యవాదాలు తెలిపారు.

ఈయూ హర్షం

తమకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని వివిధ స్థాయిలలో అధికారులకు, ఉన్నతాధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేశామని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పీ దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య తెలిపారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన సీఎం ఆదేశాల మేరకు జరిగిన ప్రక్రియను నాయకులు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జీపీడీ రావత్ నుంచి వివిధ హోదాల్లోని అధికారులకు, ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుకు ధన్యవాదాలు తెలిపారు.

నేటినుంచి లోకో రన్నింగ్ స్టాఫ్

నిరసన ప్రదర్శనలు

రైల్వేస్టేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ సౌత్ సెంట్రల్ జోన్ రైల్వేలోని కీలక కార్యాలయాలు, డీఆర్ఎం కార్యాలయాల ఎదుట 48 గంటల పాటు నిరసన వ్యక్తం చేయాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు మంగళవారం నుంచి గురువారం వరకు నిరసన చేపడుతున్నట్టు అసోసియేషన్ విజయవాడ డివిజన్ అధ్యక్షుడు ఎం వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆర్‌వీ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు, విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ వి ఉమామహేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. 2024 జనవరి 1 నుంచి 50 శాతం డీఏ క్రాస్ అయిన సందర్భంగా 25 శాతం మేరకు కిలోమీటరేజి అలవెన్స్‌ను ఇవ్వాలని కోరుతున్నారు. ఇతర కార్మికులకు అమలు చేస్తున్నట్లుగానే 46 గంటలపాటు వారపు విశ్రాంతి మంజూరు చేయాలంటున్నారు. రన్నింగ్‌స్టాఫ్‌కు 8 గంటల పని పరిమితి చేయాలని, వరుసగా రెండు రాత్రుల విధులను నిలుపుదల చేయాలని, హెడ్ క్వార్టర్ నుంచి 36 గంటలపాటు దూరంగా ఉండడాన్ని కుదించాలని, దీర్ఘకాలంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, ఆదాయపుపన్ను నుంచి కిలోమీటరేజ్ అలవెన్స్‌లో 70శాతం మేరకు మినహాయించాలని కోరుతున్నారు. విజయవాడ, బిట్రగుంట, రాజమండ్రి నుంచి లోక్ రన్నింగ్ స్టాఫ్ నిరసనలో పాల్గొననున్నారు.



ధర్నాలో పాల్గొన్న లైసెన్సుడ్ సర్వేయర్లు

రోడ్డెక్కిన లైసెన్సుడ్ సర్వేయర్లు

ధర్నాచౌక్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లైసెన్సుడ్ సర్వేయర్లు రోడ్డెక్కారు. ఆంధ్రప్రదేశ్ లైసెన్సుడ్ సర్వేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో రెండు రోజుల రిలే ధర్నా సోమవారం జరిగింది. 'ఆదుకో చంద్రన్న, ఆదుకో పవనన్న, ఆదుకో లోకేష్ అన్న' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నేతలు ముత్యం గౌడ్, అజయ్ మాట్లాడారు. 2019 నుంచి లైసెన్సుడ్ సర్వేయర్ల లైసెన్సులను రెన్యువల్ చేయకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందన్నారు. జీవో 800ను తక్షణమే అమలు చేసి లైసెన్సులు రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న సర్వేయర్ల పోస్టుల్లో లైసెన్సుడ్ సర్వేయర్లతో భర్తీచేసి వారికి ఉపాధి కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి ఆదుకోవాలని లేదంటే సర్వేయర్ల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి లైసెన్సుడ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

వైద్యవృత్తి ఎంతో పవిత్రం

● మంత్రి సత్యకుమార్ యాదవ్ ● పిన్నమనేనిలో ఘనంగా ఫ్రెషర్స్ డే

గన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే, వైట్ కోట్ సెర్మనీ సోమవారం రాత్రి టెలిమెడిసిన్ హాల్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ అధ్యక్షతన జరిగింది. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ వైద్య విద్యలో తొలిమెట్టు వేసే విద్యార్థులకు వైట్ కోట్ ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందన్నారు. సేవాభావంతో సేవలందించాలన్నారు. నైతిక విలువలను విస్మరించకుండా బాధ్యతతో వైద్య విద్యలో రాణించాలన్నారు. సీనియర్లు జూనియర్స్‌కు ఆదర్శంగా నిలవాలని, సోదర భావంతో ఉండాలన్నారు. సిద్ధార్థ అకాడమీ వేల మంది విద్యార్థులను సమాజానికి అందిస్తుందన్నారు. అన్ని రంగాల్లో నైపుణ్యత సాధించిన విద్యార్థులు అకాడమీ నుంచి వస్తున్నారన్నారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతమ్మ దేవస్థానంలో

అన్‌లైన్‌లో టిక్కెట్ల విక్రయం

పెనుగంచిప్రోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాలయ ధర్మదయా శాఖ కమిషనర్ సూచనల మేరకు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి దర్శనం టికెట్లతో పాటు పలు సేవల టికెట్లను ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకోవడానికి తగిన ఏర్పాట్లు చేశామని ఆలయ డిప్యూటి కమీషనర్ బిహెచ్వీఎస్ఎల్ కిషోర్ కుమార్ తెలిపారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వెబ్సైడ్ తో పాటు మనమిత్ర వాట్సాప్ ఫోన్ నెంబర్ ద్వారా కూడా ఈ బుకింగ్ సేవలను పొందవచ్చునని భక్తులకు తెలియజేశారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఆన్లైన్ బుకింగ్ చేసుకున్న భక్తులకు ప్రత్యేక క్యూమార్గం ద్వారా దర్శన సౌకర్యాన్ని కల్పించినట్లు కిషోర్ కుమార్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 142, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 665	

పీఎంఏవై హౌసింగ్ రుణాలకు తుది గడువు 14

తోట్లవల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పీఎంఏవై గ్రామీణ పథకంలో నూతన గృహాల నిర్మాణానికి ఆవాస్ యాప్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 14 వరకు గడువు పెంచారని మండల హౌసింగ్ ఏఈ జి నాగబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఈ పథకం కింద ఇప్పటి వరకు 195 మంది వరకు నమోదు చేసుకున్నారని తెలిపారు. అర్హత కలిగిన వారు గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను గాని, హౌసింగ్ ఏఈని గాని కలిసి డాక్యుమెంట్ అందించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబ సభ్యుల ఆధార్, రేషన్‌కార్డు, ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, సొంత ఇంటి స్థలం డాక్యుమెంట్స్, ఇంటిపన్ను, కుల ధ్రువీకరణ నకళ్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు 14వ తేదీ లోపు అందించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏఈ నాగబాబు తెలిపారు.



పరిసరాలను శుభ్రపరుస్తున్న వీకేఆర్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

గుడివాడ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య పేర్కొన్నారు. స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏడురోజుల ఎన్ఎస్ఎస్ సాంఘిక సేవా కార్యక్రమాలను నందివాడలో వేములపల్లి నాగయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రవికుమార్ పర్యవేక్షణలో స్వచ్ఛభారత్‌లో భాగంగా శుభ్రత-పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డి.దిలీప్, నందివాడ మండల విద్యాశాఖ అధికారి కె.శ్రీనివాసరావు, జి.డేవిడ్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరుగురు రౌడీషీటర్లకు బైండోవర్

గుడివాడ : సత్ప్రవర్తన నిమిత్తం ఆరుగురు రౌడీషీటర్లను సోమవారం తహసీల్దార్ కిరణ్ ఎదుట బైండోవర్ చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్సై నరసింహారావు తెలిపారు.

పెన్షన్లను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి

గుడివాడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ మొత్తాన్ని పెంచి అందించిన వ్యక్తి సీఎం చంద్రబాబు మాత్రమేనని పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం పట్టణంలోని 5వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి



పామర్రులో..

వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల పంపిణీ చేశారు. నియోజకవర్గంలో కొత్తగా 43పెన్షన్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల పేర్కొన్నారు మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 93.42 శాతం సోమవారం పంపిణీ చేశామని ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవోలు అంజనాదేవి, ఎలీషారావు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పామర్రు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అర్హులైన లబ్ధిదారులు అందుకుని వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.జ్యోతి పేర్కొన్నారు. పామర్రులో సోమవారం వేకువజాము నుంచే ఒక మోస్తారుగా కురుస్తున్న వర్షంలోనే సంబంధిత గ్రామ సచివాలయ సంక్షేమశాఖ కార్యదర్శులతోపాటు ఇతర ఉద్యోగులు చేస్తున్న పింఛన్ల ప్రక్రియను ఆమె పర్యవేక్షించారు.

పెదపారుపూడి: మండలంలోఎన్టీఆర్ సామాజిక భరోస పింఛన్ల పంపిణీ సోమవారం అన్ని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారు. మొత్తం 95.86శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీవో విమలాదేవి చెప్పారు.సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో..

గుడివాడ రూరల్: వలివర్తిపాడులో సోమవారం ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వలివర్తిపాడులో ..



రొయ్యూరులో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం

బలహీన పడిన తుఫాను

తోట్లవల్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాను బలహీనపడటంతో ధాన్యం రైతులు ఊపిరి పీల్చుకున్నారు. దిత్వా తుఫాను ప్రభావంతో ఆదివారం సాయంత్రం 1.04 మీ.మీ కొద్దిపాటి వర్షం మాత్రమే కురిసింది. ఈ వర్షానికి రైతులు పరదాలు కప్పి తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సోమవారం వాతావరణం మెరుగవటంతో ధాన్యాన్ని ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. తుఫాను బలహీనపడిందన్న వార్తలతో పరదాలు తొలగించి ధాన్యాన్ని రోడ్లపైన, కల్లాల్లో ఆరబెడుతూ రైతులు తమ పనిలో మునిగారు. అయితే రొయ్యూరు, తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అధికారులు వాహనాలను సమకూర్చి ఆరిన ధాన్యాన్ని కొని మిల్లులకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని చెప్పారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి

గుడ్లవల్లేరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రులో వేంచేసియున్న భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నుంచి శుక్రవారం వరకూ ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ నిర్మాణ ప్రదాతలు మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ అధినేత పి.వికృష్ణారెడ్డి, సుధారెడ్డిల దంపతుల నేతృత్వంలో బ్రహ్మోత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉత్సవ మూర్తులకు తిరుమంజనం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం, పల్లకీ సేవ ఉత్సవం నిర్వహించనున్నారు. 3వ తేదీ బుధవారం ధ్వజారోహనం, సూర్యప్రభ వాహనోత్సవం,పెద్ద శేషవాహనోత్సవ సేవలు నిర్వహిస్తారు. 4వ తేదీ గురువారం గజవాహనోత్సవ సేవ, రథోత్సవం, గరుడోత్సవాలను నిర్వహించనున్నామన్నారు. 5వ తేదీ శుక్రవారం చూర్ణోత్సవం, చక్రస్నానం, విశేష శ్రీనివాస కల్యాణ మహోత్సవం, చంద్రప్రభవాహనోత్సవ సేవ లు నిర్వహించ నున్నామని నిర్వాహక ధర్మకర్తలు పి.వీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు తెలిపారు.



డోకిపర్రులోని విద్యుద్దీపాలతో అలంకరించిన భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం

సరిపడా ధాన్యం సంచులను సరఫరా చేస్తాం

● వ్యవసాయాధికారి అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా ధాన్యం సంచులను సరఫరా చేస్తామని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ అన్నారు. సోమవారం బేతవోలు తదితర ప్రాంతాల్లో ఏవో పర్యటించారు. రైతులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సరిపడినన్ని గన్ని బ్యాగులు ఎన్ని కావాలన్నా సరఫరా చేస్తామని తెలిపారు. తడి ధాన్యం సంచుల్లో ఉంటే రంగు మారుతుందని తెలిపారు. రంగు మారటం వల్ల సరైన రేటు రాదని తెలిపారు. తేమశాతం ఎక్కువగా ఉండి రంగుమారితే గిట్టుబాటు ధర రాక రైతులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ధాన్యం ఆరబెట్టుకున్న తర్వాతే మిల్లులకు సరఫరా చేయాలని సూచించారు. రైతులకు ఆర్ఎస్‌కే పరిధిలో టార్పాలిన్లు సరఫరా చేశామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాశులుగా పోసి పరదాలు కప్పుకుని ధాన్యం కాపాడుకోవాలని కోరారు. అందరి ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో అనంతలక్ష్మి



భోజనం వడ్డిస్తున్న శ్రీకృష్ణయాదవ సేవా సంఘం సభ్యులు

మానసిక వికలాంగులకు భోజన వసతి

గుడివాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో మానసిక వికలాంగులకు భోజనవసతి కల్పించడం అభినందనీయమని టీడీపీ రూరల్ అధ్యక్షుడు వాసే మురళీ అన్నారు. సోమవారం స్థానిక చౌదరిపేటలోని శిరీష రీహాబిలిటేషన్ మానసిక పునరావాస కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పుట్టినరోజు సందర్భంగా దాతలు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, రామనపూడి పీఏసీఎస్ ఛైర్మన్ సూరపనేని రామకృష్ణ, తట్టివర్రు టీడీపీ నాయకులు కైలే కాళిదాసుల సహకారంతో యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.హరికుమార్ ఆధ్వర్యంలో భోజనవసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రె వెంకటగిరి, కూరాకుల నాగరాజు, రేమల్లి రజనీకాంత్, పట్టే అంజిబాబు, రషీద్‌బేగ్, షేక్ భాషా తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సతీష్‌చంద్ర

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

గుడివాడ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ బాధితులకు మనోధైర్యం నింపి వారికి అండగా ఉండాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతివ్యక్తిపై ఉందని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆశ పర్వీన్ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ఆర్.కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గుడ్లవల్లేరులో స్థానిక వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సస్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీని విద్యార్థినులు నిర్వహించారు. ఎయిడ్స్‌పై అవగాహనా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.ఎల్ వినోద్ కుమార్, డాక్టర్ టి.బాలకృష్ణ, ఎస్కే నాగుల్ మీరావలి, ఎం.హారిక తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి: అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సోమవారం మొవ్వ గ్రామ వీధుల్లో పర్యటించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కె.ఆర్.మంజుల ,అధ్యాపకులు శివనాగేశ్వరరావు, ఎం.సుందరరావు, అనిల్ కుమార్, సురేష్‌బాబు, పాల్గొన్నారు.

గుడివాడ: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. తొలుత ర్యాలీని ఎన్ఎస్ఎస్ పీవో టి.జె సతీష్‌చంద్ర జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ జి.జీవన్, గంగాధర్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గుడివాడ : గంజాయి వద్దన్నందుకు నెల్లూరులో ప్రజానాట్యమండలి సభ్యుడు పెంచలయ్యను దారుణంగా హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని సాహితీ స్రవంతి అధ్యక్షుడు లంకా సురేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఘనంగా ఎమ్మెల్యే వెనిగండ్ల జన్మదినోత్సవం

గుడివాడ, డిశంబరు1(ఆంధ్రజ్యోతి) : గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో అభిమానులు, టీడీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఆత్మీయ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కాశీ సమకూర్చిన మూ డు తోపుడు బళ్లు, తెలుగు యువత నాయకులు వంశీ సమకూర్చిన రెండు తోపుడు బళ్లను చిరు వ్యాపారులకుఅందజేశారు. మహేష్ ఆధ్వర్యంలో ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్నివెనిగండ్ల ప్రారంభించారు. ఎన్టీఆర్ స్టేడియంలోశ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు.

గుడివాడరూరల్ :మల్లాయిపాలెంలోని తాళూరి కల్యాణమండపంలో కూటమి నేతల ఆధ్వర్యంలో వెనిగండ్ల జన్మదిన వేడుకలను నిర్వహించారు.



గుడ్లవల్లేరులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

గుడ్లవల్లేరు : సోమవారం రాత్రి గుడ్లవల్లేరులోని వల్లభనేని రంగయ్య కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము 55వ జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వెంకట్రావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

● హెచ్ఎం గుళ్లపల్లి పద్మావతి

గుడివాడ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి) : చిత్తూరుజిల్లాలోని యాదమరి పాఠశాలలో నవంబరు 28,29 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషుమీడియం పాఠశాల విద్యార్థులు బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుళ్లపల్లి పద్మావతి తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు యమ్.జ్యోతిగణేష్, ఎన్.బెనర్జీ, ఎ.శివ, జి.రాకేష్ వీరమాధవ్, షేక్ భాషాలు విశేష ప్రతిభ కనబరచి జట్టు విజయంలో వరుసగా మూడోసారి బంగారు పతకాన్ని సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులు, వ్యాయామోపాధ్యాయులు గోవాడ శ్రీనివాసరావు, మడకా సత్యఅన్వేష్‌లను మహిళ సంఘం సభ్యులు డి.రాజ్యలక్ష్మీ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పద్మావతి

ఆర్థిక సాయం

గుడివాడ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇందిరానగర్ కాలనీకి చెందిన కమ్మరం వర్కర్ సయ్యద్ బాజీకి ఇటీవల ప్రమాదావశాత్తు నడుముకి దెబ్బ తగలడంతో ది గుడివాడ ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఇందిరానగర్ కాలనీలోని బాజీ ఇంట్లో రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.లక్ష్మణరావు, అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్ , కోశాధికారి అత్మూరి విజయకుమార్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

గుడివాడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : స్థానిక ధనియాలపేటలోని ప్రణవాశ్రమంలోని ఎయిమ్ ఫర్ సేవా హాస్టల్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో సోమవారం రూ.10వేలు విలువ గల నిత్యావసరాలను అందజేశారు. రోటరీ క్లబ్ సహకారంతో ఎల్ఈడీ టీవీ క్లబ్ అధ్యక్షుడు సురేష్, వేణుబాబు, రాంబాబుల ఆర్థిక సాయంతో మూడు సైకిళ్లను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అందజేశారు.

ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ

గుడివాడ : స్థానిక ఏలూరురోడ్డులోని జ్ఞాన హనుమాన్ ఎలక్ట్రికల్స్ అండ్ శానిటరీ దుకాణంలో షట్టర్‌ను పగలగొట్టి ఆదివారం రాత్రి దొంగలు రూ.1.50లక్షల విలువగల సామాగ్రి చోరీకి గురైనట్టు దుకాణ యజమాని గణపతి సింగ్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై వై.వి.వి సత్యనారాయణ తెలిపారు.

వ్యక్తి కనిపించడం లేదని ఫిర్యాదు

గుడివాడ : నాగవరప్పాడుకు చెందిన మువ్వ శ్రీనివాసరావు అనారోగ్య కారణాలతో నవంబరు 28వ తేదీ మధ్యాహ్నం 1గంటకు బయటకు వెళ్లి వస్తానని తిరిగి రాలేదు. భార్య అంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.

ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతుల పాట్లు



మొవ్వలో కాటాలు వేసి నిల్వ ఉన్న ధాన్యపు బస్తాలు

కూచిపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను ప్రభావం కారణంగా చిరుజల్లులు కురుస్తుండటంతో వాతావరణంలో చోటుచేసుకున్న మా ర్పుల నేపథ్యంలో రైతన్నలు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. సంచుల కొరత, లారీల కొరత వెంటాడుతూనే ఉంది. కూలీలను దిగుమతి చేసుకుని వరి కోతలు, వరి నూర్పిడిలు ముమ్మరం చేశారు. వారం రోజుల నుంచి కాటాలు వేసిన ధాన్యం లారీల కొరత కారణంగా రోడ్ల వెంట నిల్వ ఉండిపోయాయి. సంచులు లేక నూర్చిన ధాన్యం ఎక్కడ ధాన్యం అక్కడ గుట్టలుగా పేరుకుపోయాయి. రైతన్నలు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. ఆది, సోమవారాల్లో కురిసిన వర్షంతో రైతులు బెంబేలెత్తుతున్నారు.

పెదపారుపూడి : ప్రస్తుత వాతావరణం అనుకులంగా లేకపోవడంతో రైతులు కోతకోసి ఆరబెట్టిన ధాన్యంతోపాటు, కల్లాల్లోని ధాన్యాన్ని రక్షించుకునేందుకు అన్ని ఆర్ఎస్‌కేల్లో రైతులకు అవసరమైన టార్పాలిన్లు సిద్ధంగా ఉన్నాయని తహసీల్దార్ బి.శ్రీనునాయక్ సోమవారం తెలిపారు. రైతులు అధైర్యపడకుండా పరదాలు తీసుకెళ్లవచ్చన్నారు. తుపాను వల్ల మండలంలో రైతులు వరికోతలు వాయిదా వేసుకోవాలని కోరారు.

పామర్రు : దిత్వా తుఫాన్ ప్రభావంతో పామర్రులో సోమవారం ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తుండటంతో ఇప్పటికే నూర్పిడిచేసి రోడ్లపై ఆరబోసిన ధాన్యంతోపాటు, పొలాల్లో, రోడ్లపై ఆరబోసిన ఉన్న పంటను కాపాడుకునేందుకు కర్షకులు పరుగులు పెట్టారు. వ్యవసాయశాఖ ఏడీఏ స్వర్ణలత ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అన్నదాతలతో మాట్లాడి వారిని అప్రమత్తం చేశారు. ముఖ్యంగా రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులు తడకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ధాన్యం తడవకుండా మండలవ్యాప్తంగా అన్ని ఆర్ఎస్‌కేల్లో పరదాలు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.శివనాగరాణి, వీఏఏలు శేఖర్, ఆచార్యులు, పలువురు రైతులు పాల్గొన్నారు.



పామర్రులో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ స్వర్ణలత, ఏవో శివనాగరాణి



గుడ్లవల్లేరుతో ధాన్యం తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు సివారు గ్రామం రెడ్డిపాలెం గ్రామంలో చిన్నరైతు వర్షానికి ధాన్యం రాసి తడిచిపోకుండా హడావిడిగా పరదాలు కప్పుకొంటున్నారు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

అంబేడ్కర్ భవనం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు

మచిలీపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం నిర్మాణానికి కలెక్టర్ బాలాజీ ప్రతిపాదనలతో కోల్ ఇండియా లిమిటెడ్ ద్వారా తొలివిడతగా రూ.4కోట్లు మంజూరైనట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి ఒక ప్రకటనలో తెలిపారు.తెలిపారు. భవనంలో స్టడీసర్కిల్, సెమినార్ నిర్వహించడానికి హాలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఉపాధి శిక్షణ సమయంలో చదువుకోవడానికి ప్రత్యేక వసతులతో కూడిన గదులను నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి కృషి చేస్తామని ఇచ్చిన హామీ మేరకు రూ.10 కోట్ల అంచనాలతో భవనం నిర్మాణం చేస్తామని, తొలివిడతగా రూ.4కోట్ల నిధులకు అనుమతులు తెచ్చామని ఆయన వివరించారు.



అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష చేస్తున్న మంత్రి రవీంద్ర

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలనిమంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, ఇతర అధికారులతో అభివృద్ధి పనులపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థలో పెండింగ్ పనుల పూర్తికి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫైళ్లను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. రోడ్ల విస్తరణ కార్యక్రమం చేపట్టాలన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాలన్నారు. వహించాలన్నారు. రోడ్లు, డ్రెయిన్ల పనులపై మంత్రి సమీక్షించారు.



కౌలురైతులకు రుణాలు అందిస్తున్న సొసైటీ చైర్‌పర్సన్ పరుచూరి వెంకటేశ్వరరావు, చిత్రంలో ఏవో, సీఈవోలు

కౌలుకార్డులు లేని రైతులకు రూ.15 లక్షల రుణాలు

చల్లపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కౌలు కార్డులు లేని కౌలు రైతులకు అండగా నిలిచినట్లు మంగళాపురం సొసైటీ చైర్‌పర్సన్ పరుచూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళాపురం సొసైటీ కార్యాలయంలో కౌలుకార్డులు లేని 30 మంది రైతులను జాయింట్ లయబులిటీ గ్రూపులుగా ఏర్పాటుచేసి ఒక్కో కౌలు రైతుకు రూ.50వేల చొప్పున రూ.15 లక్షలు రుణాలను అందజేశారు. సొసైటీ చైర్‌పర్సన్ వెంకటేశ్వరరావు చేతులమీదుగా కౌలురైతులకు రుణాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏవో కె.మురళీకృష్ణ, సొసైటీ సీఈవో చంద్ర రవికుమార్, పర్సన్లు గొరిపర్తి వెంకటేశ్వరరావు, నిడమానూరు జగన్‌లు పాల్గొన్నారు.



అవనిగడ్డలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంజయ్‌దత్

పేదలకు మేలు చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే

● ఏఐసీసీ కార్యదర్శి సంజయ్‌దత్

అవనిగడ్డ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేద బడుగు బలహీన వర్గాల ప్రయోజనాలు నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఏఐసీసీ కార్యదర్శి సంజయ్‌దత్ స్పష్టం చేశారు. అవనిగడ్డ వైఎస్ఆర్ ఫంక్షన్ హాలులో సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అందె శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా పార్టీ పరిశీలకులు సంజయ్ దత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారీ వర్గాల కోసం, ధనవంతుల కోసం పనిచేస్తున్నాయని దుయ్యబట్టారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు సంస్థాగత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలుత పార్టీ కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఏకె.హర్షద్, మాజీ ఎమ్మెల్యే ఎలీజా, పామర్రు మాజీ ఎమ్మెల్యే డి.వై.దాస్, ఓబీసీ సెల్ చైర్మన్ శొంఠి నాగరాజు, జిల్లా పార్టీ కార్యదర్శి జగ్గవరపు బాబూరావు, డీసీసీ కార్యదర్శి కాగితాల సుదర్శన్‌రావు, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధితుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి



కానూరులో పింఛను అందజేస్తున్న గోపు సత్యనారాయణ



ఈడేపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న గోపీచంద్, ఫణికుమార్

పేదల జీవనానికి ఆర్థిక భరోసా

అవనిగడ్డ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అభాగ్యుల కుటుంబ జీవనానికి ఎన్టీఆర్ భరోసా పింఛను తోడ్పడుతోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. లంకమ్మ మాన్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరిగింది. మంచానికే పరిమితమైన దివ్యాంగ నిరుపేదలు పసుపులేటి మురళీకృష్ణ, గంగు సీతారామయ్యలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. ఈవో తోట శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు అడపా వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

మచిలీపట్నం టౌన్ : పేద మైనారిటీ వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము అన్నారు. ఫత్తుల్లాబాద్‌లో నాగరాము పింఛన్లు పంపిణీ చేశారు. ఇంగ్లీషుపాలెంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీంబేగ్ పింఛన్లు పంపిణీ చేశారు. బందరు నగరంలో ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ పండుగలా సాగింది. సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ ఈడేపల్లిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోతేపల్లిలో మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని పింఛన్లు పంపిణీ చేశారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి సోమశేఖర్, కమ్మిలి మధు, నారగాని వాణి, శేషు, సుబ్రహ్మణ్యం, చిన్ని తదితరులు పాల్గొన్నారు. చిన్నాపురం గ్రామంలో మాజీ ఎంపీపీ, బందరు రూరల్ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు, కార్యదర్శి జె. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కానూరులో తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పింఛన్లు పంపిణీ చేశారు. సెక్రటరీ శ్రీహరి, బొమ్మిడి ఏడుకొండలు, పీతా రాము, మోపిదేవి కృష్ణ, కొక్కిలిగడ్డ ప్రభుదాసు, మోకా వెంకన్న పాల్గొన్నారు. **గూడూరు** : నూతనంగా మంజూరైన స్పౌజ్ పెన్షన్‌ను సోమవారం మండల టీడీపీ అధ్యక్షుడు, డీసీ చైర్మన్ పోతన స్వామి పంపిణీ చేశారు. ఎస్ఏ బేగ్, బాసం శెట్టి విజయ్, టి. ప్రసాద్, సచివాలయ సిబ్బంది విజయ్ పాల్గొన్నారు.



ఫత్తుల్లాబాద్‌లో పింఛను అందజేస్తున్న నాగరాము



గూడూరులో పింఛను అందజేస్తున్న పోతనస్వామి



హెచ్ఐవీపై అవగాహన ర్యాలీలో డాక్టర్ శ్రావ్య, లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుశీల, డాక్టర్ సల్మా, డాక్టర్ రాంబాబు

అవగాహనతో హెచ్ఐవీని తరిమికొట్టాలి

● పీహెచ్‌సీ డాక్టర్ శ్రావ్య

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అవగాహనతో హెచ్ఐవీని తరిమికొట్టవచ్చని డాక్టర్ వి.శ్రావ్య అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం లేడీయాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిలకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ శ్రావ్య ర్యాలీ ప్రారంభించి ప్రసంగించారు. ప్రిన్సిపాల్ పి. లక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లంకిశెట్టి హరనాథబాబు, అధ్యాపకులు హిరణ్మయి, సాజిదా సుల్తానా, జ్యోతి, స్పందన పాల్గొన్నారు.

హెచ్ఐవీ ఇమ్యూనిటీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం

హెచ్ఐవీతో ఇమ్యూనిటీ వ్యవస్థ దెబ్బతింటుందని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు అన్నారు. కృష్ణా యూనివర్సిటీలో సోమవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు మాట్లాడుతూ, ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణహాని ఉండదన్నారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుశీల మాట్లాడుతూ, హెచ్ఐవీకి మెరుగైన చికిత్స అందుబాటులోకి వచ్చిందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సల్మా, డాక్టర్ రవి, డాక్టర్ శేషారెడ్డి, డాక్టర్ శాంతికృప తదితరులు మాట్లాడారు.

మల్లవోలులో ర్యాలీ

గూడూరు : హెచ్ఐవీపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని మల్లవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి తరుణ్‌శంకర్ అన్నారు. సోమవారం ప్రపంచ నివారణ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మల్లవోలులో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ రూపశ్రీ, డాక్టర్ మహిత, ఎంపీహెచ్‌ఈవో తాతబ్బాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





గీతామందిరంలో విశేష అలంకరణ, గొడుగుపేట వేంకటేశ్వర స్వామి దేవాలయంలో భగవద్గీత పారాయణం



భగవద్గీత అధ్యాయాలు పఠిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గీతా జయంతి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన దేవాలయాల్లో విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. రంగనాయక స్వామి దేవాలయంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బృందావనదాస్ తదితరులు పాల్గొన్నారు. గీతా మందిరంలో శ్రీకృష్ణపరమాత్మను అంగరంగ వైభవంగా అలంకరించారు. భగవద్గీత పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మామిడి వేణుగోపాలరావు, మాజేటి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు. గొడుగుపేట వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సంపూర్ణ భగవద్గీత పారాయణ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వడ్లమూడి లక్ష్మీ నరసింహారావు, టీటీడీ ధర్మ ప్రచారిణి జొన్నలగడ్డ మాధవి ఆధ్వర్యంలో సంపూర్ణ భగవద్గీత పారాయణ నిర్వహించారు. శ్రీవారి సేవకులు తురగా ప్రసాద్ భక్తులకు కంకణాలు పంపిణీ చేశారు. **నాగాయలంక** : వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం గీతా జయంతిని వైభవంగా నిర్వహించారు. భగవద్గీత గ్రంథానికి, వేణుగోపాలస్వామికి అర్చక స్వామి పూజలు నిర్వహించారు. విద్యాభారతి పాఠశాల విద్యార్థులు భగవద్గీతలోని రెండు అధ్యాయాలు పఠించారు. చిట్టా వాణి ఆధ్వర్యంలో మిత్ర బృందం భగవద్గీత 18 అధ్యాయాలు పారాయణం చేశారు. గో పూజ నిర్వహించారు. విద్యాభారతి పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రత్నారావు చిట్టావాణిని, గీతా సమాజం సన్మానించారు. సత్యప్రసాద్, పోతరాజు కామేశ్వర శర్మ, లంకా వెంకట చలపతిరావు, మామిడి దామోదరరావు పర్యవేక్షించారు. అవనిగడ్డ : గీతామందిరంలో గీతాజయంతిని ఘనంగా నిర్వహించారు. మహిళలు భగవద్గీతలోని 18 అధ్యాయాలు పారాయణం చేశారు. లక్ష్మీ తాయారమ్మ, హిమబిందు ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. అర్చక స్వామి దీవి నరసింహమూర్తి, సూర్య ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు, ధర్మకర్త శ్రీహరి బాబు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

అవనిగడ్డ : ప్రభుత్వ జడ్పీ హైస్కూల్‌లో గత 10 రోజులుగా నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రముఖ పారిశ్రామికవేత్త, విక్కుర్తి వీరరాఘవయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విక్కుర్తి శ్రీనివాస్ నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా వెయ్యి రూపాయలు, రెండవ బహుమతిగా రూ.500, మూడో బహుమతిగా రూ.300 అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. రామచంద్రాపురం గ్రామానికి చెందిన మత్తి శేషగిరిరావు(గురూజీ) గీతాశ్లోకాలు కంఠస్థం చేయించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక శ్రద్ధ

కోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైతుల ధాన్యం కొనుగోలు విషయమై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని యువనేత మండలి వెంకట్రామ్ తెలిపారు. సోమవారం వి.కొత్తపాలెంలో ధాన్యం కొనుగోళ్లను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాలతో అధికారులు వి.కొత్తపాలెం గ్రామానికి లారీలు ఏర్పాటు చేసి ధాన్యం తరలింపు వేగవంతం చేసినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు మేలు చేయాలని అధికారులకు సూచించారు.

ఘంటసాలలో మెగా వైద్యశిబిరం రేపు

ఘంటసాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో అస్టర్ రమేష్ హాస్పటల్, స్వచ్ఛ ఘంటసాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 3న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సీనియర్ జనరల్ మేనేజర్ జ్యేష్ఠ రాజశేఖర్ తెలిపారు. వైద్యశిబిరంలో గుండె, మెదడు, నరాల, శ్వాస సంబంధిత వ్యాధులకు, షుగర్, థైరాయిడ్ వ్యాధిగ్రస్థులకు, జనరల్ మెడిసిన్, కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శిబిరాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభిస్తారని తెలిపారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.



బల్లిపర్రులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో స్వాతి.

రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి

పెడన రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఆర్డీవో స్వాతి తెలిపారు. బల్లిపర్రు, శింగరాయపాలెం గ్రామాల్లో రైతులు రోడ్ల పక్కన ఆరబెట్టిన ధాన్యం రాశులను పరిశీలించారు. మిల్లుకు తరలించే విషయంలో ఆలస్యానికి గల కారణాలను తెలుసుకున్నారు. ధాన్యం రక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మండల వ్యవసాయాధికారిణి జెన్నిని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. తహసీల్దార్ అనిల్ కుమార్, ఆర్ఐ విజయలక్ష్మి, ఏఏవో మహలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఏవో క్షేత్రస్థాయి పర్యటన

నాగాయలంక : దిత్వా తుఫాన్ ప్రభావం ఆదివారం వర్షం కురవడంతో వరి పొలాలను ఏవో ఏ.సంజీవ్ కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రేమాలవారిపాలెం, నంగేగడ్డ, ఏటిమొగ, భావదేవరపల్లి గ్రామాల్లో పర్యటించి పంటను పరిశీలించారు. శనివారం వరకు వరి కోతలు పూర్తయిన ధాన్యాన్ని సురక్షితంగా ఉంచుకున్నట్లు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. టార్పాలిన్లు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కోడూరు : తేమ శాతంతో సంబంధం లేకుండా రైతులవద్ద ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సహాయ కార్యదర్శి యద్దనపూడి మధు కోరారు. సోమవారం స్థానిక రైతుసంఘం నాయకులతో కలిసి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయికి వినతిపత్రం అందించారు. దిత్వా తుఫాను రైతులను వెంటాడుతున్న నేపథ్యంలో ప్రభుత్వమే రైతులకు అన్నివిధాలుగా అండగా నిలవాలని కోరారు. లేకుంటే రైతు మనుగడే కరువు అవుతుందన్నారు. రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య, రేపల్లె యోగప్రకాష్, పోలాబత్తిన మోహనరావు, మహమ్మద్ కరీముల్లా, కొప్పనాతి తాతయ్య, బాలగోపాల రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా బాలాజీ

చల్లపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ ఎంపీడీవో ఎం.బాలాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చల్లపల్లి ఈవో పి.వి. మాధవేంద్రరావు తదితరులు బాలాజీని కలిసిన వారిలో ఉన్నారు.

ఘంటసాలలో యార్లగడ్డ శివరామప్రసాద్

ఘంటసాల : ఘంటసాల మండల డిప్యూటీ ఎంపీడీవో యార్లగడ్డ శివరామప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన శివరామప్రసాద్‌ను డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఏవో శ్రీనివాస చందు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఘనంగా సత్కరించారు.

పెడనలో హేమప్రకాష్..

పెడన రూరల్ : డిప్యూటీ ఎంపీడీవోగా ఆర్ హేమప్రకాష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నాగాయలంక నుంచి ఆయన బదిలీపై వచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మి పదోన్నతిపై నాగాయలంక డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. హేమప్రకాష్, విజయలక్ష్మిని కార్యాలయ సిబ్బంది అభినందించారు.